నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 2-11-2023 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No.L1/HQ/SD/258/2021-2023 సంపుటి :30 సంచిక:71 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

తీవ్ర వాదాలు
కూలుతున్న సౌధాలు
బుద్ధం శరణం.

ఉత్త మాటలు
చెత్త రాజకీయాలు
నేటి పోకడ.

త్రిముఖ పోటీ
ప్రజాపక్ష విజయం
ఓట్ల తుపాను

బతుకు పాట
పంటఫలాల మూట
పండుగ పూట.

శుచీ శుభ్రత
నీరు తిండి వసతి
ఆరోగ్య ధామం.

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాలు

కొత్త ప్రభాకరుని మీద
కత్తి తోని దాడి !
రాజుకున్న కుంపటైంది
రాజకీయ వేడి !

కుర్చిమీద అధికారం
నిలబెట్టే ఓటు !
కూల్చి వేసె పగవద్దోయ్
నల్ల త్రాసు కాటు !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

అభివృద్ధి కొనసాగాలంటే.. మరోసారి అవకాశమివ్వండి.. సబిత ఇంద్రారెడ్డి

హైదరాబాద్, నవంబర్ 1: అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి అవకాశమివ్వాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి అన్నారు. మీర్ పేట్ కార్పొరేషన్ పరిధిలోని విజ్ఞాన పురి కాలనీలో జరిగిన కాలనీవాసుల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ? అభివృద్ధికి బాటలు వేసాను? ధైర్యంగా మీ ముందుకు వచ్చి ఓట్లు అడుగుతున్నానన్నారు. తాము వేసిన రోడ్లలో తిరుగుతూ అభివృద్ధి చేసిన పార్కుల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో నడుస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పొందుతూ ఏర్పాటు చేసిన గ్రౌండ్లలోనే సభలు నిర్వహిస్తూ కొన్ని పార్టీల నాయకులు ఏం చేసారని అడుగుతుంటారన్నారు.

ఎన్నికలు, వర్షాలు, కరోనాతో ఇబ్బందులు పడ్డ నియోజకవర్గానికి వేల కోట్లతో అభివృద్ధి చేసానన్నారు. అభివృద్ధి కొనసాగలాంటే మరొక్కమారు అవకాశం ఇవ్వండని అన్నారు. వర్షాలు వచ్చినపుడు, కరోనాతో ప్రజలు ఇబ్బందులు పడ్డప్పుడు కానరాని నేతలంతా ఇప్పుడు ఎన్నికలు రాగానే ప్రజల ముందుకు వస్తున్నారన్నారు. మరొక సారి అవకాశం కల్పిస్తే? మరింత డెవలప్ మెంట్ చేస్తానన్నారు.

మంత్రి గంగుల సమక్షంలో బీఆర్ఎస్ లో చేరికలు

హైదరాబాద్, నవంబర్ 1:తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీలో చేరికలు కొనసాగుతున్నాయి. తాజాగా కరీంనగర్ జిల్లాలో రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో చింతకుంట గ్రామ యాదవ సంఘం నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ గెలుపునకు కృషి చేస్తామని వారు వెల్లడించారు. రాష్ట్రంలో కూడా బీఆర్ఎస్ పార్టీ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

తెలంగాణలో అభివృద్ధిని అడ్డుకున్నదే కాంగ్రెస్ పార్టీ : ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు

నల్లగొండ, నవంబర్ 1: తెలంగాణలో మౌలిక వసతులు దూరం చేసింది కాంగ్రెస్ పార్టీ. అధికార దాహంతో సీఎం కేసీఆర్‌పై అవినీతి మచ్చ వేస్తున్నారు. కాంగ్రెస్ సీట్ల కోసం అభ్యర్థుల నుంచి కోట్లు వసూలు చేశారని నల్లగొండ జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావుఅన్నారు. బుధవారం నల్లగొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎన్నికల ఇంచార్జ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు మీడియా సమావేశంలో మాట్లాడారు.

రేవంత్ రెడ్డి అన్ని అవాస్తవాలు మాట్లాడుతున్నారు. విజన్‌లేని పార్టీ కాంగ్రెస్ పార్టీ అని మండిపడ్డారు. ఫ్లోరైడ్ భూతాన్ని తరిమికొట్టిన పార్టీ బీఆర్ఎస్ అని స్పష్టం చేశారు. తెలంగాణలో పంట ఎండిపోయింది అనే ఫిర్యాదు లేదు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం సస్యశ్యామలంగా మారిందన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇరవై ఏళ్లు నల్లగొండలో అధికారంలో ఉండి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. నల్లగొండ అభివృద్ధికోసం కాలుకు బలపం కట్టుకుని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి తిరుగుతున్నారు.

కోమటిరెడ్డి ఆటలు నల్లగొండలో సాగవన్నారు. భూపాల్ రెడ్డి గెలుపు నల్గొండలో ఎప్పుడో ఖాయమైందన్నారు. ఎన్నికల టూరిస్టులను తరిమి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, జెడ్పీచైర్మన్ బండ నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడా కిషన్ రెడ్డి, చెరుకు సుధాకర్, కటికం సత్తయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, ఇతర పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

రాహుల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్, నవంబర్ 1: బీజేపీ పార్టీ భారీ షాక్ తగిలింది. బీజేపీ నేత మాజీ ఎంపీ వివేక్ వెంకట స్వామి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తన కుమారుడు వంశీకి చెన్నూర్ అసెంబ్లీ టికెట్ ను కేటాయించాలన్న హామీ పై ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మాట్లాడుతూ? సోనియా, మల్లిఖార్జున్ నాయకత్వం బలోపేతం కోసం వివేక్ పార్టీలో చేరారని చెప్పారు. కీలక సమయంలో వివేక్ పార్టీలో చేరారన్నారు. వారి చేరికతో వెయ్యి ఏనుగుల బలం చేకూర్చిందని వ్యాఖ్యానించారు. రేపు జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వివేక్ చేరిక తెలంగాణకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేసీఆర్ ను గద్దె దించాలనే లక్ష్యంతోనే తాను కాంగ్రెస్ పార్టీలో చేరినట్టుగా వివేక్ వెంకటస్వామి ప్రకటించారు.తెలంగాణ సాధన కోసం ఆనాడు కాంగ్రెస్ ఎంపీలు పోరాటం చేసినట్టుగా ఆయన గుర్తు చేశారు.కేసీఆర్ పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు.

నేటి కందం– నేటికి అందం

కం॥ గురువు పై మక్కువయోశీలకు
వర బాంధవ లాసరి సక్తి వాసాని దలుపన
"పెరుమాల పెరున్నాలం"ను
పరువగదువె ప్రజలందరు సంసారమయోగ!!

(నవంబర్ 2: పెరుమాల పెరున్నాలు స్మృతిదినం కేరళలో విస్తృతంగా జరుపుతారు..)

–రాధశ్రీ
సెల్:9494481210

ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో రాజశ్యామలా యాగం.. పాల్గొన్న సీఎం కేసీఆర్ దంపతులు

హైదరాబాద్, నవంబర్ 1:తెలుగు రాష్ట్రాల సర్వతోముఖాభివృద్ధిని కాంక్షిస్తూ ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక యాగాన్ని తలపెట్టారు. విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాముల ఆధ్వర్యంలో ఈ యాగానికి ఈ రోజు అంకురార్పణ జరిగింది. రాజశ్యామలా సహిత సుబ్రహ్మణ్యేశ్వర యాగంగా దీనికి నామకరణం చేశారు. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుండి ప్రత్యేకంగా విచ్చేసిన పండితుల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఈ యాగం జరగనుంది. గోపూజ అనంతరం కేసీఆర్ దంపతులు యాగశాల ప్రవేశం చేశారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసనతో యాగానికి అంకురార్పణ జరిగింది. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామికి కేసీఆర్ దంపతులు సాష్టాంగ నమస్కారం చేసి యాగంలో ఆసీనులయ్యారు.

గురు ఆజ్ఞ తీసుకుని యాగాన్ని ప్రారంభించారు. కేసీఆర్ దంపతులతో స్వరూపానందేంద్ర స్వామి యాగ సంకల్పం చేయించారు. విశాఖ శ్రీ శారదాపీఠ అధిష్టాన దైవం రాజశ్యామల అమ్మవారికి స్వరూపానందేంద్ర స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశ్యామల అమ్మవారిని వనదుర్గ అవతారంలో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యాగం నిర్విఘ్నంగా కొనసాగాలని ముక్కోటి దేవతలను ప్రార్థిస్తూ అస్త్ర రాజార్చన, కర్కరీయ స్థాపన నిర్వహించారు.

యాగంలో పాల్గొనే పండితులు, రుత్వికులకు కేసీఆర్ దంపతులు దీక్షా వస్త్రాలను స్వయంగా అందించారు. అఖండ స్థాపన అనంతరం అగ్నిమథనం చేసి యాగశాలలో అగ్నిని ప్రతిష్టించారు. తెలుగు రాష్ట్రాలు సర్వతోముఖాభివృద్ధి చెందాలని, సస్యశ్యామలంగా

కళకళలాడాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ యాగాన్ని తలపెట్టారని పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామి తెలిపారు. రాజశ్యామల యాగం విశాఖ శ్రీ శారదాపీఠానికి ప్రత్యేకమని స్పష్టం చేశారు. యాగంలో రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్, ఎంపీ నామా నాగేశ్వర్ రావు, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ మంత్రి వేణుగోపాల చారి, ప్రభుత్వ సలహాదారు అనురాగ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ పొర్లు దండాలు పెట్టినా కాంగ్రెస్‌కు అధికారం పగటికలే : మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, నవంబర్ 1:రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ పార్టీ పగటి కలలు కంటున్నది. రాహుల్ గాంధీ పొర్లు దండాలు పెట్టినా.. పది సార్లు పర్యటించినా మీ పార్టీ అధికారంలోకి రాదని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్‌లో మీడియా సమావేశంలో కాగ్రెస్ విధానాలపై ఫైర్ అయ్యారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ..బీఆర్ఎస్‌ది కుటుంబ పరిపాలన అంటారు. అలా అయితే మీకున్న అర్హత ఏంటని సూటిగా ప్రశ్నించారు.నీకు తెలంగాణ చరిత్ర తెలుసా.. ఉద్యమంలో చనిపోయిన వారు కాంగ్రెస్ వల్లనే కాదా అని నిలదీశారు.

పదకొండు సార్లు మీకు అధికారం ఇస్తే సాగునీరు తాగు నీరు ఇవ్వకుండా పోతిరెడ్డిపాడుకు బొక్క కొట్టి, ఆర్డీఎస్ బద్దలు కొట్టి నీళ్లు దోచుకుపోయారని విమర్శించారు. ఈ పదేళ్లలో దేశంలోనే అత్యధిక జీడీపీ తెలంగాణదని స్పష్టం చేశారు. ఇప్పుడు బీఆర్ఎస్ మహారాష్ట్రలో విస్తరిస్తుంటే మీకు బుగులు పుట్టుకుంది. మీ అవసరాల కోసం బీసీలు, మైనార్టీలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకున్నారని విమర్శించారు.

మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఎర్ర శేఖర్‌కు టికెట్ జడ్చర్లలో ఇవ్వకుండ ఇతరులకు ఇవ్వడంతోనే బీసీలపై మీకున్న కపట ప్రేమను జనం తెలుసుకున్నారని చెప్పారు. మీరెన్ని రోడ్ షోలు చేసినా.. డ్రామాలు చేసినా జనం నమ్మరన్నారు. మా పార్టీలో చెల్లని వాళ్లకు టిక్కెట్లు ఇచ్చారు. మా నాయకుడు గల్లీలో ఉంటాడు. మీ నాయకుడు ఢిల్లీలో ఉంటాడు. పగటి కలలు కంటున్న కాంగ్రెస్ నాయకులను ప్రజలు బొంద పెట్టడం ఖాయమన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు విలువ తెలుసుకో..

(నేదునూరి కనకయ్య– 9440245771)

భారత దేశం బ్రిటిష్ పాలన నుండి విముక్తి పొందిన తర్వాత జాతీయ నాయకులు దేశ పరిస్థితులను దృష్టిలో వుంచకొని ప్రజాస్వామ్య వ్యవస్థను ఎంపిక చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు పునాది..ఓటు హక్కు, ఓటు విలువ, ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన చైతన్యం కలిగించి ఓటర్లతో సదస్సులు కళాశాల విద్యార్థులు యువతతో ర్యాలీలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఈ ఏడాది "బలమైన ప్రజాస్వామ్యం కోసం ఎన్నికల అక్షరాస్యత "అనే నినాదం తో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఎన్నికల కమిషన్ నిర్వహించింది.

భారత్ రాజ్యాంగం 326 ఆర్టికల్ ప్రకారం 18 సం॥రాలు నిండిన జాతీయ పౌరులకు వయోజన ఓటుహక్కు కల్పించబడింది. కుల,మత, లింగ, ప్రాంత, ధనిక, పేద 'వివక్ష లేకుండా అక్షరాస్యులకు నిరక్షరాస్యులకు సార్వత్రిక వయోజన ఓటు హక్కు కలిపించి ప్రపంచ రాజకియ చరిత్రలో గొప్ప విప్లవాత్మకమైన మార్పుకు శ్రీకారం చుట్టింది.

అభివృద్ధి చెందిన దేశాల కంటె ముందే మన దేశంలో వయోజన ఓటింగ్ హక్కు కల్పించి ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది వేసింది.

ఓటు హక్కు అందరికీ వజ్రాయుధం అయింది. ప్రభుత్వాల ఏర్పాటులో ఓటర్లు క్రియాశీలక పాత్ర పోషిస్తారు. ఓటు సామాన్యుని గొంతుకైంది. ఓటు ద్వారా ప్రజాప్రతినిధులను ప్రశ్నించే హక్కు ఓటర్లకు సంక్రమించింది. ఓటు హక్కు ద్వారా ఓటరు స్వేచ్ఛగా ఓటు వేసే హక్కు కలిగి ఉన్నాడు. తమకు నచ్చిన ప్రజాప్రతి నిధులను ఎన్నుకునే అధికారం వుంటుంది. ప్రజాస్వామ్యంలో ప్రజల చేతిలో సార్వ బౌమాధికారం అధికారం వుంటుంది.ఓటు హక్కు ద్వారా 5 ఏళ్ళకు ఒక సారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తమ సార్వ భౌమాధికారాన్ని వినియోగిస్తారు.

ప్రజలే ప్రభువులు

అమెరికా మాజీ అధ్యక్షులు "అబ్రహం లింకన్" అభిప్రాయం ప్రకారం "ప్రజల చేత ప్రజల కొరకు నిర్వహించబడే ప్రజల ప్రభుత్వం" ప్రజాస్వామ్యం అని నిర్వచించారు.

ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు. ప్రజాస్వామ్య మనుగడకు ఓటే పునాది.

ఎన్నికల కమిషన్

ఎన్నికల కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తి తో పనిచేస్తూ ఓటరు నమోదు ఓటరు జాబితా తయారు, దేశములో చట్టసభల స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తుంది. ఎన్నికల్లో ఓటర్లు అందరు విధిగా ఓటు హక్కువినియోగించుకోవాలి.

ఓటు హక్కు నిర్లక్ష్యం

దేశంలో చాలా మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడం లేదు1952 లో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల్లో 45 శాతం ఓటర్లు మాత్రమే ఓటు హక్కును వినియోగించారు. 2019 నాటికి17 వ లోకసభ ఎన్నికల్లో 67 శాతం మంది ఓటు వేశారు. మొత్తం ఓటర్లలో 90 శాతం ఓటింగ్ జరిగితే దేశం అభివృద్ధి పథంలో పురోగమిస్తం దన్న మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వ్యాఖ్య ఓటర్లకు కనువిప్పు కావాలి..

యువత దేశ భవిత

దేశ రాజకీయాల్లో యువత క్రియాశీలకంగా పాల్గొనాలి యువత రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.ఓటు వేయడం పై ఆసక్తి చూపడం లేదు. సాధారణ ఎన్నికల్లో యువత ఓటింగ్ శాతం గ్రామీణ ప్రాంతాల కంటె పట్టణ ప్రాంతాలలో తక్కువ వుంటుంది.పట్టణ ప్రాంతాలలో చదువుకున్న వారు ఓటింగ్ పై ఆసక్తి చూపడం లేదు.ఓటింగ్ రోజును సెలవు దినంగా పాటిస్తు విహార యాత్రలకు వెల్లుచున్నారు.

నోటుకు ఓటు ప్రజాస్వామ్యానికి చేటు

ప్రజాస్వామ్యానికి ఓటు ఆయుధం. ఓటరు నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి. కానీ రాజకీయ పార్టీలు ఓటును అంగడి సరుకుగా మార్చాయి. డబ్బు మద్యం వివిధ ప్రలోభాలకు ఓటును అమ్ముకునే నోటుకు ఓటు సంస్కృతి పెరిగి ప్రజాస్వామ్యానికి చేటుగా పరిణమించింది.రాజకీయ పార్టీలు ఓటర్లకు డబ్బులుఎరగా చూపి ఓటు వేయించుకుంటున్నారు. రాజకీయ పార్టీలు హామీల హోరులో హర్రసు పాట పాడుతూ ఓటర్లను హైరానాకు గురిచేస్తూ ఓటు బ్యాంకుగా వాడుకొని ఎన్నికల్లో గెలిచి అధికార దాహంతో రాజకీయాలను వాణిజ్య పరంగా చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన దాని కంటే ఎన్నికల వ్యయం చేస్తున్న రాజకీయ పార్టీల మీద నియంత్రణ లేదు.ఈ పరిస్థితులు ప్రజాస్వామ్య వ్యవస్థ స్ఫూర్తికి విఘాతంగా పరిణమించాయి.

ఓటును అమ్ముకోవడం ద్వారా ప్రజలు ప్రజా ప్రతినిదులను ప్రశ్నించే హక్కును కోల్పోతారు. ప్రజాసంక్షేమం కుంటుపడుతుంది.

దేశ భవిష్యత్తు నాయకుల చేతుల్లో వుంటుంది. ఆనాయకుల తలరాత మార్చేది ఓటు కాళోజీ అన్నట్లు అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు ఏ పాటి వాడో చూడాలి. ప్రజలకు ఇప్పటివరకు ఏమిచేశాడో గమనించి నేరచరిత లేని నిజాయితీ వంతులను ప్రజా ప్రతినిధులు గా ఎన్నుకొని అవినీతి రహిత' నేరరహిత రాజకీయ వ్యవస్థకు ఓటర్లు ఉద్యమించాలి.

దేశ భవిష్యత్తు అభివృద్ధి ప్రభుత్వాల మార్పుకు ఓటు వజ్రాయుధం లాంటిది. ప్రభుత్వం నిర్బంధ ఓటింగ్ విధానాన్ని అమలు చెయ్యాలి. ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల ప్రచారంలో చూయిస్తున్న శ్రద్ధకంటే ఎక్కువగా ఓటింగ్ హక్కు వినియోగం ఇ.వి.ఎం.ల ఉపయోగం, ఎన్నికల విధానం ఎన్నికల అక్షరాస్యత మీద దృష్టి పెట్టాలి.

రాజకీయ పార్టీలు యువత విభాగం ఆధ్వర్యంలోలో ఓటు నమోదు, ఓటరు గుర్తింపు ఆధార్ కార్డు తో ఓటరు కార్డు అనుసంధానం దొంగ ఓటర్ల గుర్తింపు కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలి. ఎన్నికల అక్షరాస్యత పరివ్యాప్తికి శిక్షణ తరగతులు నిర్వహించాలి. ఓటింగ్ శాతం పెంచడానికి కృషి చెయ్యాలి.

ప్రభుత్వం నిర్బంధ ఓటు హక్కును కలిపించాలి.

ప్రభుత్వం ఎన్నికల కమిషన్ పౌరసమాజం యువత, మహిళా సంఘాలు, స్వచ్ఛంధ, సామాజిక సేవా సంస్థలు ఓటు హక్కు వినియోగం పై అవగాహన చైతన్యం కలిగించాలి.

కళాశాలల్లో ఓటు హక్కు వినియోగం మీద సాంస్కృతిక కళా బృందాల ప్రదర్శనల ద్వారా ఓటర్లను చైతన్య పరచాలి .

"ఓటర్లు అందరూ తమ ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా సమర్థులైన అభ్యర్థులకు ఓటువేసి ఎన్నుకుంటానని ప్రతిజ్ఞ చెయ్యాలి"

అప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ బల్లోపేతం అవుతుంది.

భారత రాజ్యాంగ పిత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లు

భారత దేశం చారిత్రకంగా వెనుకబడిన వర్గాలు దళితులు, ఆదివాసీలు తాడితులు, పీడిత వర్గాలు రాజకీయంగా అభివృద్ధి చెందటానికి ఓటు హక్కు ముఖ్యమైన మార్గం అని పేర్కొన్నారు. ప్రతి ఓటరు ఓటు విలువ తెలుసుకొని ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కు వినియోగించు కోవాలి. ప్రజాస్వామ్యాన్ని గౌరవించడం ప్రజల సామాజిక బాధ్యత.

సోమవారం శృతిలయ –సీల్‌వెల్ అక్కినేని ఎక్సలెన్స్ టీవీ. స్టార్ అవార్డ్స్–2023 కార్యక్రమంలో నటుడు మురళీమోహన్‌గారికి అక్కినేని ఎవర్‌గ్రీన్ అవార్డును ప్రదానం చేస్తున్న అతిథులు. వేదికపై తెలంగాణ పోలీస్ హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, దైవజ్ఞశర్మ, వై. విజయకుమార్, మహ్మ రఫి, ఆమని మరియు నటీనటులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు

జగిత్యాల, నవంబర్ 1: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్సీ ఎల్.రమణ, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం సీనియర్ న్యాయవాది ఎర్ర నరసయ్య, పులి శెట్టి శ్రీనివాస్, పాండురంగ విఠల్ శశిధర్, అనుమల్ల భుజంగం ఎమ్మెల్సీ,ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తెలంగాణలో ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనే అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే కరెంట్ కష్టాలు తప్పవన్నారు. సాగుకు మూడు గంటల కరెంట్ చాలన్న కాంగ్రెస్‌ను బొంద పెట్టాలని పిలుపునిచ్చారు.

అంతకు ముందు జగిత్యాల పట్టణ 38వ వార్డులో కౌన్సిలర్ దాసరి లావణ్య, ఎలుమద్రి కిశోర్, పోతునుక మహేష్ ఆధ్వర్యంలో పలువరు కాంగ్రెస్,బీజేపీ పార్టీలను వీడి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పోతంశెట్టి సతీష్ రాజ్ శ్రీపాల్ రెడ్డి, భూసారపు శ్రీనివాస్ గౌడ్, చీటీ రామకృష్ణారావు, రామిడి జగన్, చింత శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి హరీశ్ రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ముద్దగౌని రామ్మోహన్ గౌడ్

హైదరాబాద్, నవంబర్ 1:ఎల్బీనగర్ నియోజకవర్గంలో మంత్రి హరీశ్ రావు సమక్షంలో రామ్మోహన్ గౌడ్ దంపతులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ?. పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేశారని, ఒకే కుటుంబంలో విభేదాలు సహజం, సహచరుడిని కాపాడుకోవాలని వచ్చామని మంత్రి హరీష్ రావు తెలిపారు. కష్టకాలంలో పార్టీ కోసం పని చేశాడన్నారు.

ముక్కు సూటి తత్వం ఉన్న మనిషి రామ్మోహన్ గౌడ్ అన్నారు. పార్టీ రెండుసార్లు టికెట్ ఇచ్చింది కానీ స్వల్ప మెజార్టీతో ఓడిపోయారన్నారు. అయినా జిహెచ్ఎంసి ఎన్నికల్లో 11 మంది కార్పొరేటర్లను గెలిపించారన్నారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తామన్నారు. ఆయన వెంట వచ్చే కార్యకర్తలకు తగిన అవకాశాలు ఉంటాయన్నారు. రామ్మోహన్ గౌడ్, అతని అనుచరుల ప్రాధాన్యత విషయంలో పార్టీ ప్రతినిధిగా తాను బాధ్యత తీసుకుంటానన్నారు.

రైలు ప్రమాద బాధితులకు అండగా ప్రభుత్వం.. మంత్రి బొత్స

విజయనగరం, నవంబర్ 1: రైలు ప్రమాద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. కంటకాపల్లి రైలు ప్రమాదంలో గాయపడి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని మంత్రి బొత్స సత్యనారాయణ అందజేశారు. ఆసుపత్రిలోని వార్డుల్లో చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లి వారికి అందుతున్న చికిత్స, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సహాయంపై మంత్రి తెలుసుకున్నారు. రైలు ప్రమాద ఘటనలో మృతి చెందిన 13మందికి, 30మంది గాయపడిన వారిని కలిసి మొత్తం 43మందికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2.59 కోట్లు పరిహారంగా అందజేస్తోందన్నారు. మంగళవారం 8మందికి పరిహారం అందించాం, ఈరోజు 12మందికి పరిహారం అందజేశాం, రేపటిలోగా అందరికీ పరిహారం అందిస్తామన్నారు.

ఏదైనా అనుకోని ఘటనలు జరిగినపుడు ఆ ఘటనల్లో బాధితులను ఆదుకొని సహాయం అందించి వారికి మానవతా దృక్పథంతో సహాయం అందించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ చర్యలు చేపడుతున్నారన్నారు. గాయాల పాలైన వారు జీవితాంతం బాధపడకుండా వారికి తోడ్పాటు అందించేందుకు ముఖ్యమంత్రి శాశ్వత అంగవైకల్యం పాలైన వారికి రూ.10 లక్షల సహాయం ప్రకటించారన్నారు. నెల రోజులకు మించి ఆసుపత్రిలో చికిత్స అవసరమైన వారికి రూ.5 లక్షలు, నెల రోజుల్లోపు చికిత్స పూర్తయి ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన వారికి రూ.2 లక్షలు సహాయం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎం.పి. బెల్లాన చంద్రశేఖర్, ఎం.ఎల్.సి. సురేష్ బాబు, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డి.ఎం.హెచ్.ఓ. డా.భాస్కరరావు, డి.సి.హెచ్.ఎస్. డా.గౌరీశంకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్, తదితరులు పాల్గొన్నారు.


మం'దారం సాహిత్య సమితి
కీ॥శే॥ దారం శ్రీధరరావు స్మారక పురస్కారం
జాతీయ స్థాయి మం'దారం కథల పోటీ 2023
ఫలితములు
1. ప్రథమ బహుమతి: - "నీరు లేని నది" రచన :- శ్రీమతి కోపూరి పుష్పాదేవి, విజయవాడ.
2. ద్వితీయ బహుమతి : " జపస సాఫల్యం" రచన : - శ్రీమతి కె.వి. సుమలత, గుడివాడ.
3. తృతీయ బహుమతి : " గృహదేవత" రచన : - శ్రీమతి సంబరాజు లీల, కొత్తపేట, హైదరాబాద్.
ప్రోత్సాహక బహుమతులు (7)
1. "ఎవరు దోషి ?" రచన :- ఉప్పలూరి మధుపత్ర శైలజ, చందానగర్, హైదరాబాద్.
2. "వార్త విశేషాలే" రచన :- మీనాక్షి శ్రీనివాస్, కాకినాడ.
3. "ఉనికి" రచన : సింహ ప్రసాద్, కూకట్ పల్లి, హౌసింగ్ బోర్డ్, హైదరాబాద్.
4. "మనసు మంందారం" రచన: భమిడి వెంకటేశ్వరులు, మెహిందిపట్నం, హైదరాబాద్.
5. "పెద్దలికం" రచన : వసుంధర, కాప్రా, హైదరాబాద్.
6. "మట్టి రంగు పూలు" రచన: పాతూరి రామరాజు, కాకినాడ.
7. "మనుష్య

నేటినిజం
సాహితీ కెరటాలు
website:www.netinijam.com website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 2-11-2023

"బీసీ ఆత్మగౌరవ భవనాలు" ఆవిష్కరణ

హైదరాబాద్, నవంబర్ 1(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ రాసిన 'బీసీ ఆత్మగౌరవ భవనాలు' పుస్తకాన్ని ఆదివారం మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ నివాసంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల జీవన ప్రమాణాలు పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్మాణాత్మకంగా కృషి చేస్తూ వస్తుందని అన్నారు. చేతి వృత్తుల జీవితాలకు భరోసా కల్పించామని, దేశంలో ఎక్కడా లేనివిధంగా బీసీలకు ఆత్మగౌరవ భవనాలు కట్టించామని తెలిపారు.

వార్షిక సంచికను ఆవిష్కరిస్తున్న డా॥ కే.వి.రమణాచారి తదితరులు.

పుస్తక సమీక్ష

ముచ్చటగొలిపే "చిన్నోడి ముక్తకాలు"!

- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

ప్రముఖ కవి, సినీ విమర్శకులు, డాక్యుమెంటరీ చిత్రాల రూపకర్త, కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కార గ్రహీత వారాల ఆనంద్ గారు తమ ముద్దుల మనుమడి ముచ్చట్లను "చిన్నోడి ముక్తకాలు" గ్రంథం రూపంలో అందిస్తూ.. తానే కాక.. తమతో పాటు అందరినీ బాల్యంలోకి లాక్కొని వెళ్లారు. వివిధ ప్రక్రియల్లో గ్రంథాలను వెలువరించిన అనుభవమున్న ఆనంద్ ఆయన మనుమడు ప్రద్యుమ్నతో ఉన్న బంధాన్ని-అనుబంధాన్ని.. ముద్దు మురిపాలను



ప్రతులకు:వారాల ఆనంద్
ఇ.నెం.8-4-641
హనుమాన్‌నగర్
కరీంనగర్-505 001.

ముచ్చట గొలిపేలా ఇందులో ఆవిష్కరించారు. అందరిలాగే ఆనంద్‌గారి బాల్యం అమ్మ ఒడికీ.. నాన్న నీడకూ పరిమితమైనది. కాటగలిసిన పిల్లాడిలా మాటకీ మౌనానికీ నడుమ గాలిలో ఆధారం లేని ఊయల ఊగుతూ గడిపిన తమ బాల్యాన్ని నెమరు వేసుకుంటూ.. కవి ఆనంద్ మనుమడి ప్రద్యుమ్న గురించిన అనుభవాలను.. అనుభూతులను.. అక్షరాల్లో నిక్షిప్తం చేసారు. తాను కోల్పోయిన బాల్యాన్ని తనకిచ్చాడంటూ ప్రద్యుమ్న వింత వింత ఆటలను చేష్టలను కవితామయం చేశారు. ఈ సందర్భంగా మనుమడిని కానుకగా యిచ్చిన తమ కూతురు రేల-వేణు మాధవ్ దంపతులను కృతజ్ఞతా పూర్వకంగా అభినం దించారు. ప్రద్యు మ్న ఆట పాటలను చిలిపి పనులను.. చక్కగా కెమెరాలో బంధించిన ఆనంద్ కుమారుడు అన్వేష్‌ను ప్రశంసించారు.

కవి ఆనంద్ ఆనందాన్ని అక్షరాల్లో ఆవిష్కరించిన తీరు అభినందనీయంగా ఉంది.

వాడితో ఆడుకుంటున్న
కాదు వాడే నన్నాడిస్తున్నాడు
అరవై ఏళ్లక్రితం పోగొట్టుకున్నదేదో

తిరిగిస్తున్నాడంటూ.. తాతగా మనుమడివట్ల ఆనంద్ తమ సంతోషాన్ని ప్రకటించారు.

మనుమడి అవిశ్రాంత ఆటలను.. చేష్టలను అందంగా చెబుతూ..

ఎక్కడబడితే అక్కడ వస్తువులతో
ఇప్పుడు ఇల్లులా ఉంది.
వాడు రాకముందు ఎక్కడివక్కడ
'మ్యూజియం'లా వుండేది అని ప్రకటించడం బాగుంది. నిజమే కదా.. చిన్న పిల్లలు ఇంట్లో వస్తువులను అటూ. ఇటూ పారేసే సన్నివేశాన్ని పై కవిత ద్వారా చక్కగా తెలియజెప్పారు.

చిన్నోడు ఏమంటున్నాడో తెలుస్తలేదు
కొత్త భాషేదో నేర్చుకోండి
అంటోంది అమ్మమ్మ అంటూ మరో కవితను రాశారు.

కుర్చీ లెక్కుతున్నాడు
టేబుల్ మీది టీ కప్పులకు
కాలం చెల్లిందంటూ చమత్కరించారు.

పరుగొచ్చినప్పటి నుండీ చిన్నోడిని
పట్టుకోవడమే కష్టం...
అమ్మమ్మకు చిక్కడు, తాతకు దొరకడు అంటూ మనుమడి బుడి బుడి అడుగులను వడి వడి పరుగులను అందంగా ఆవిష్కరించారు.

చిన్నోడూ, చంద్రుడూ
ఒక్కలాగే ఉన్నారు
కొంతకాలం సుస్తీ
కొంత కాలం మస్తీ" అంటూ నర్మగర్భంగా కవి ప్రకటించిన భావాలు బాగున్నాయి.

చిన్నోడికి నవ్వడమే తెలుసనుకున్నా
ఏడవడమూ తెలుసు
జీవితమంటే తీపి చేదూ అంటూ కవి తాత్త్వికతను ప్రకటించారు.

చిన్నారులకు నవ్వులూ-కేరింతలు మాత్రమే తెలుసంటూ మరో కవితలో తెలియజెప్పారు.

ఒంటరితనమో సమూహమో
తేడా లేదు
వాడికి తెలిసిందలా నవ్వులూ
కేరింతలూ కవ్వింతలే అంటూ
చిన్నారుల మనస్తత్వాన్ని ఆవిష్కరించారు.

చీరకడితే అమ్మాయిలాగే వున్నాడు
నవ్వుల తోడు చిరు సిగ్గులెక్కడివో
అంటూ చమత్కరించారు.

గోదావరి అలల్లో చిన్నోడి గలగలలు
నిరంతర ప్రవాహమే కదా
జీవన గమన సూత్రమంటూ జీవన సత్యాన్ని తెలిపారు.

చుక్కల్లో చంద్రుల్ని చూడగానే
చిన్నోడి ముఖం వెలుగుతుంది
దా..దా.. అంటాడు
ఆడుకుందానేమో అంటూ మనుమడి గురించి మురిపెంగా చెప్పారు.

వాడేమో ఏడుస్తూ నవ్వులోకి
నవ్వుతూ ఏడుపులోకి
దిగిపోతున్నాడు! నాకేమో
నవ్వాలో ఏడ్వాలో తెలుస్తలేదని ప్రకటించారు.

ఇలా.. కవి ఆనంద్‌గా తమ మనుమడితో పొందిన అనుభూతులను అందంగా అక్షరాల్లో నిక్షిప్తం చేశారు. ఈ చిన్ని పుస్తకంలో మనుమడితో కవి ఆనంద్‌గారు మరియు ఆయన సతీమణి ఇందిరగారు పొందిన అనుభవాలను.. ఆనంద్‌గారి కుమారుడు అన్వేష్ కెమెరాలో బంధించిన చిత్రాలను చక్కగా పొందుపరిచారు. ముఖచిత్రం గ్రంథానికి నిండు శోభను కూర్చింది. ఇందలి ముక్తకాలు చదువుతుంటే మనందరం మళ్లీ బాల్యంలోకి వెళ్తాం. మనుమడితో ఉన్న బంధాన్ని, అను బంధాన్ని,, అనుభవాలను, అనుభవా లను అక్షరాల్లో ఆవిష్కృతం చేసిన ఆనంద్‌గారికి అభినందనలు తెలియజేద్దాం.

పుస్తకాలు చైతన్యాన్ని కలిగిస్తాయి

హైదరాబాద్, నవంబర్ 1:(నేటినిజం ప్రతినిధి) పుస్తకాలు ప్రజలకు గొప్ప చైతన్యాన్ని, స్ఫూర్తిని కలిగిస్తాయని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ॥ లింబాద్రి అన్నారు. ఉత్తర తెలంగాణ సమస్యలను ప్రొఫెసర్ తిరుపతి తన పుస్తకం ద్వారా ప్రస్ఫుటింపచేశారని ప్రశంసించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రొఫెసర్ తిరుపతి రచించిన రౌద్రం (ఉత్తర తెలంగాణ కవిత్వం) పుస్తకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. అనంతరం టీఎస్‌పీఎస్‌ఈ మాజీ చైర్మన్ ప్రొ॥ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి రౌద్రం దోహదపడుతుందన్నారు. డాక్టర్ జిలకర శ్రీనివాస్, రచయిత డాక్టర్ పసునూరి రవీందర్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రొ. కోదండరాం, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బిఎస్ రాములు, ప్రొ॥ గాలి వినోద్‌కుమార్, బొజ్జ బిక్షమయ్య, గిన్నారపు ఆదినారాయణ పాల్గొన్నారు.

చిమ్మపూడి ఫౌండేషన్ సేవలు అభినందనీయం- డా॥కె.వి.రమణాచారి

చిమ్మపూడి శ్రీరామమూర్తి బహుముఖీన ప్రజ్ఞాశీలిగా, సాహిత్యం సంగీతంలో ఉన్నటువంటి వారిదైన ప్రత్యేక ప్రతిభను కనబరచడంతో పాటు ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి నాలుగు సంవత్సరాలుగా చేస్తున్న వివిధ సేవలు, వైవిధ్యభరిత కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా॥కె.వి.రమణాచారి కొనియాడుతూ పురస్కార గ్రహితలకు శుభాభివందనలు తెలిపారు. సాంస్కృతిక, సాహిత్య పత్రికలను నడపడం అంటే రోజూ కత్తి మీద సాము చేయడమేనని, అయినా కళాకారులు రచయితలను ప్రోత్సహిస్తూ పత్రికలను నడుపుతున్న ముగ్గురు సంపాదకులను సన్మానించుకోవడం స్ఫూర్తిదాయకమని అభినందించారు.

సామాజిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక సేవా సంస్థ చిమ్మపూడి ఫౌండేషన్ చతుర్థ వార్షికోత్సవ వేడుకలు శనివారం రాత్రి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో ఘనంగా జరిగాయి. దూరదర్శన్ పూర్వ సంచాలకులు డాక్టర్ పాలకుర్తి మధుసూదన్‌రావు అధ్యక్షతన ప్రారంభమైన వేడుకలకు ముఖ్య అతిథిగా డాక్టర్ కేవీ రమణాచారి హాజరయ్యారు.. ఈ సందర్భంగా సాహిత్య, సాంస్కృతిక సేవా రంగాల్లో విశేషమైన సేవలందిస్తున్న రసమయి సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎం.కె. రాము, యువకళావాహిని సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మినారాయణ, వంశీ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు వంశీ రామరాజు, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ కార్యదర్శి ముద్దాళి రఘురామ్, జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుదిబండి వెంకటరెడ్డి, అభినందన సంస్థ అధ్యక్షురాలు ఇ. భవాని, నవ్య నాటక సమితి అధ్యక్షులు వేమరాజు విజయకుమార్, యువ భారతి డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, లిటిల్ మ్యూజిషియన్ అకాడమీ రామాచారిలకు సేవా పురస్కారాలను, పత్రికాధిపతులు నేటినిజం ఎడిటర్ బైస దేవదాసు, సాహితీకిరణం ఎడిటర్ పొత్తూరి సుబ్బారావు, కళా పత్రిక ఎడిటర్ మహ్మద్ రఫీలకు సేవా పురస్కారం జరిగింది. ఈ కార్యక్రమంలో బి.సి. కమీషన్ చైర్మన్ డా॥వకుళాభరణం కృష్ణమోహన్ మాట్లాడుతు చిమ్మపూడి ఫౌండేషన్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని, ఈ సందర్భంగా పురస్కారాలు అందుకుంటున్న పురస్కార గ్రహితలకు శుభాకాంక్షలు తెలిపారు.

సభాధ్యక్షుడు దూరదర్శన్ పూర్వ సంచాలకులు డా॥ పాలకుర్తి మధు సూదన్ రావు మాట్లాడుతూ వందలాది మందికి పురస్కారాలు అందజేసిన ఆయా సంస్థల అధ్యక్షులకు పురస్కారాలు ప్రదానం చేయడం ఓ గొప్ప సన్నివేశమని చిమ్మపూడి శ్రీరామ మూర్తిని అభినందించారు.

ప్రముఖ సాహితీవేత్త సుధామ, ప్రముఖ ఆధ్యాత్మిక వక్త జి. సత్యవాణి పాలొన్నారు. బుర్రా మోహనకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. దేశభక్తి స్వాతంత్ర్య సమర స్ఫూర్తి పేరిట తెలంగాణ వ్యాప్తంగా స్కూళ్ళలో నిర్వహించిన వక్తృత్వ పోటీ విజేతలకు బహుమతులు అందించారు. పేరిణి ప్రకాశ్ శిష్యబృందం తమ నాట్యంతో అలరించారు.

పురస్కార గ్రహితలు స్పందిస్తూ నగరంలోని పలు సాహిత్య సాంస్కృతిక సంస్థల అధ్యక్షులు ఒకే వేదికపై అందరికీ పురస్కారాలు ప్రదానం చేయడం పట్ల చిమ్మపూడి ఫౌండేషన్ వారికి ధన్యవాదాలు తెలిపారు.

నీవు సల్లగుండాలె
(వచన కథా కావ్యం-40)

పట్నాలను వెతుక్కుంటూ
పల్లెలు వలస పోవడం కాదు !
పల్లెను వెతుక్కుంటూ
పట్నాలు కదిలి రావాలి !
పరిసరా పరిశుభ్రతకు చిత్తశుద్ధి కావాలి !
పల్లె అందం
లోకానికి తెలవాలి ।
మనసుల్లోని కుళ్ళు తగ్గాలంటే
గ్రామాభివృద్ధికి బాటలు వేయాలంటే
ఊరిచుట్టూ విస్తరించే,
వ్యర్థాల నిప్పుల కుంపట్లు తొలగించాలి!
స్వచ్ఛభారతానికి స్వేచ్ఛగా
అందరి సహకారం లభించాలి! కరోనా భయం,
దోమల నిష్కారుణ్యం
అంటువ్యాధుల అడకత్తెరలు"
ప్రజలకు అర్థమయ్యేటట్లు చేసి,
ప్రభుత్వ సహకారాన్నందుకొని,
ఇంటింటి శౌచాలయ కార్యక్రమం
విజయవంతం చేసింది సరయు.

ఆడవాళ్ళ ఆత్మగౌరవం పెరిగింది
పారిశుధ్యం పాతపద్ధతును చెరిగింది !
ఊరికి రాకపోకల సౌకర్యం
ఊరు చుట్టూ అందమైన దారులు
ఆ దారుల చుట్టూ మొక్కల బారులు
పల్లెతల్లి సౌందర్యాన్ని
పదింతలు పెంచింది !
భూగర్భ శౌచమార్గాలు
ఊరిని భూతల స్వర్గంలా మార్చినాయి.
నిర్మాణాలు క్రమబద్ధమయినాయి
వీధి దీపాలు చీకటి పాపాలను తరిమేసినాయి.
ఇంటింటికి నల్లా ఇల్లాండ్ర
ఒంటిని సేదదీర్చింది !
ఊరుమ్మడి సొమ్ము
ఊరుమ్మడి బాధ్యతయ్యింది మతాలకతీతంగా
పండుగలు, ఉత్సవాలు, జాతరలు...
జాతీయ దినోత్సవాలు -
అందరూ కలిసి చేసుకునే రోజులొచ్చినాయి!
ప్రభుత్వ పథకాలన్నీ
వెంకటాపురం ప్రజల వద్దకు చేరడానికి
ముండ్లులేని బాటలు పరచుకున్నాయి!
మంచిని వ్యతిరేకించే వాళ్ళ ఉనికి
ప్రశ్నార్థకంగా మారింది!
పట్నాల నుండి వచ్చి పాఠాలు చెప్పే పంతూళ్ళు,
కొందరు పంతులమ్మలు
ఇక్కడే, ఇష్టపూర్వకంగా ఉంటున్నారు!
చదువులమ్మ సోకులు సరిచేసుకుంటూ
మనసు నిండా అనుకున్నది
ఓ పల్లెతల్లీ!
'నీవు సల్లగుండాలె' ! అని...

-దోరవేటి
సెల్:9866251679

కాకి అరిచింది?!

కాకి అరిచింది !
సూర్యుడు ఎగకొట్టకుండా
భూమి పై తప్పక ఉదయిస్తాడని !
గ్యారెంటి శుభోదయం !.

కాకి అరిచింది !
ఇంట్లో మనం కాకుండా ఇంకా నాల్గురు ఎక్కువై
అన్నం గిన్నెలోని ఒక్క మెతుకునైనా
మిగలకుండా తినేస్తారని !
చుట్టాలు చుట్టుముట్టుగా వస్తారని
అతిథి దేవోభవ

కాకి అరిచింది !
ఇంకో నిమిషంలో పది కాకులు వచ్చి కరెంటు షాకుతో
కింద పడి చచ్చిన కాకికి సంతాపం తెలియజేస్తాయనే.!
సంఘం శరణం గచ్ఛామి.

కాకి అరుస్తునే ఉంది.!
తన గూట్లో కోకిల గుడ్డులోంచి బయట పడి
తనను పొదిగిన కాకిని
కోకిల పిల్ల అమ్మా ! అంటుందని !
ఆహా ! మమకారం.

వేళ కాని వేళ ఎన్నో కాకులు మొగులు కింద
పడుతున్నట్లు,అరుస్తున్నాయి !
బహుశా భూకంపం రావచ్చని
బాకాలు ఊదుతూ హెచ్చరికలు చేస్తునే ఉన్నాయి
ఓహో !ఆపద్భాందవ

ముందు ఇంట్లోంచి బయటకు రండి
బతికి మళ్లీ రేపు మనం కాకికి
కృతజ్ఞతలు చెప్పుకోవచ్చు!

నల్ల నల్ల పక్షి అనుకుంటాం !
నిజంగా కాకి మనకోసం రెక్కలు కట్టుకుని
దిగి వచ్చిన దేవదూతే

-కందాళై రాఘవాచార్య
8790593638

సునందామృతం

గర్త జంబుక న్యాయము

గర్త అంటే గుంట లేదా గొయ్యి అని అర్థం. జంబుకం అంటే నక్క

జంతువులలో నక్కకు మంచి పేరు లేదు. కుటిలత్వం మోసకారి తనానికి , అవకాశవాదానికి ప్రతీకగా చెబుతారు.

దీని గుణాలను, ప్రవర్తనను బాగా గమనించిన పెద్దలు అది చేసే పనులను గుంట నక్క చేష్టలు అంటారు.

అది ఎక్కువగా గోతుల దగ్గర కాచుకుని ఉంటుంది. అవకాశం,అదును చూసి గోతిలో పూడ్చిన శవాన్ని పీక్కుని తింటుంది. అందుకే నక్కను జిత్తులమారిదనీ , అది ఎరుగని బొక్కలు అంటే జంతువుల ఎముకలు ఉండవనీ, నక్క చేయని దుష్ట పనులు ఉండవనీ అంటారు.

చిన్నయ సూరి రాసిన పంచ తంత్ర కథల్లో నక్క గురించి చాలా కథలు ఉన్నాయి. అడవికి రాజైన సింహంతో కలిసి తిరుగుతూ ఉండటం. ఇతర జంతువులపై చాడీలు చెప్పి వాటిని చంపిస్తుందని విన్నాం. ఆహారం గురించి ఎలాంటి శ్రమ పడదనీ, సింహం వేటాడి తినగా మిగిల్చిన ఆహారాన్ని తింటుందని చదువుకున్నాం.

అందుకే నక్క గురించి తలుచుకోగానే ఇవన్నీ కళ్ళ ముందు మెదులుతాయి.

అలాంటి దుష్ట బుద్ధి, జిత్తులమారితనం కలిగి, చెడు పనులు చేసే వారి చేష్టలకు ఉదాహరణగా ఈ గర్త జంబుక న్యాయమును చెబుతుంటారు.

ప్రస్తుత సమాజంలో ఇలాంటి వారు కొందరు కనిపిస్తూ ఉంటారు. వీరికి నిలువెల్ల స్వార్థమే ఉంటుంది.

ఇతరులపై చాడీలు చెప్పి పబ్బం గడుపుకునే వారూ,మనిషి పోయి ఒకరేడుస్తూ వుంటే అతని మరణాన్ని రాజకీయం చేసి లబ్ధి పొందాలని ప్రయత్నించే వారూ, అవకాశం కోసం ఎదురు చూస్తూ తమ ఉన్నతికి ఎంతకైనా తెగించే వారూ కనిపిస్తూ ఉంటారు.

ఇలాంటి వారిని చూసినప్పుడు మనకు ఈ గర్త జంబుక న్యాయము వెంటనే గుర్తుకు రావడం పరిపాటి.

-పురిమల్ల సునంద,9441815722

ఆకాశవాణి అమ్మలాంటిది: కే.వీ.రమణాచారి

విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన డా॥ కే.వి.రమణాచారి

హైదరాబాద్, నవంబర్ 1: (నేటినిజం ప్రతినిధి) పరుల కోసం ఆలోచించే వారికి భగవంతుడి కృప ఎల్లప్పుడు ఉంటుందని తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. మహాత్మా గాంధీ, స్వామి వివేకానంద, మదర్ థెరిసా లాంటి వారు తమ కోసం కాకుండా పరుల కోసం పాటు పడ్డారని ఆయన చెప్పా రు. సత్కళాభారతి 27వ వార్షికోత్సవం సందర్భంగా సత్కళాభారతి కార్టూన్ పోటీలు-2023, సత్కళాభారతి భాగవత పద్య గాన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమాలను రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ప్రముఖ సినీ నేపథ్య గాయ కులు, సంగీత దర్శకులు, శ్రీ పార్థ సారథి నేమాని అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రభుత్వ సలహాదారుడు డా॥ కే.వి. రమణా చారి పోటీలలో విజేతలుగా నిల్చిన వారికి నగదు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కేవీ రమణాచారి మాట్లా డుతూ పాలగుమ్మి, శ్రీశ్రీ, దాశరతి, మంగళం పల్లి బాలమురళీ కృష్ణ వంటి గొప్ప గొప్ప మహనీయులు ఆకా శవాణి దూరదర్శన్ నుంచి అభివృద్ధి చెందా రని, ఆకాశవాణి అమ్మలాం టిదని ఆయన అన్నారు. సత్కళాభారతి సత్య నారాయణ ఇంత మంచి కార్య క్రమాన్ని నిర్వహించడం అభినందనీ యమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కార్టూనిస్టు చిలువేరు మృత్యుంజయ, ఉదయశంకర్, న్యాయ నిపుణులు విద్యాన్ శ్రీపానకంటి దక్షిణమూర్తి, హాస్యానందం ఎడిటర్ పి. రాము, వ్యవస్థాపక అధ్యక్షుడు జి. సత్యనారా యణ, యదు మోహన్ పాల్గొన్నారు.

నాన్న నా దిక్సూచి

నాన్నా బలం
నాన్న ను మించిన ప్రేమ మరొకటి లేదు
నాన్న నా దైవం
నడక నేర్పిన నాన్న!!.

నాన్న అంటే ఆకాశమంత ప్రేమ
నాన్న నాకు కొండంత అండా
ఆత్మగల నాన్న
అనురాగం ఆప్యాయత పంచే నాన్న!!

కన్నవారికి మెతుకు
కన్న బిడ్డకు బతుకు
నిచ్చుటకై నాన్న పరుగు!!

కనిపించే దైవం అమ్మానాన్న
మన సంతోషమే నాన్న సంతోషం
నాన్న ప్రేమ అజరామరం
నాన్న త్యాగమూర్తి.!!

-దేవులపల్లి రమేశ్,
9963701294

మనిషీ నువ్వు మారు

పంచభూతాలలో మార్పులేదు
పర్వతాలు తలవంచలేదు
నదులప్రవాహాలు ఉన్నాయి
చెట్టు నిలబడే ఉన్నది
భూమాత ఓర్పులో మార్పులేదు
ఆకాశం మాత్రం కోపగిస్తున్నది
వీటన్నింటిని
ఉచితంగా అనుభవిస్తున్ననాడు
మనిషిమాత్రం కర్తవ్యవిముఖుడైనాడు
కొండలను పిండిచేస్తున్నాడు
నీటిని అమ్ముకుంటున్నాడు
చెట్లజాడలగపడకుండా కొట్టేస్తున్నా
భూమాత ఓర్పుతో మోస్తూనే ఉన్నది
మనిషినువ్వుచేస్తున్న తప్పులకు
వానదేవుడు వర్షించటానికి
కృత్రిమమేఘాలు సృష్టించావు
మొక్కలు నాటు నీరుపొయ్యి
ప్రకృతి నీవశమై నీకదగండ్లు తీరుస్తుంది
మనిషీ నువ్వొకసారి మారిచూడు
కాలుష్యపుకోరలనుండి బయటపడతావు
రాబోయే తరాలకు బంగారు
భవిష్యత్తునివ్వడం నీ కర్తవ్యం.

-డా.మైలవరపు
లలితకుమారి
9959510422

నేల మీద వున్నప్పుడే

అంతరాలలో
అంతరాలు పోవడం లేదు
కనుపాపఅంత చీకటి వేళ
మినుక్కుమనే నక్షత్రాలు
ఏ పాటి వెలుగునిస్తాయి
కటిక చీకటి అంతట
నిండుకున్నప్పుడు.

వాడెవడో, వీడెవడో, ఆరాలు తీసినోడు
మనోడా కాదా అని నిఘా పెట్టినోడు
పెద్దతలగా, పెద్దోడుగా వున్నా సరే
మహావృక్షమే చెదలు పట్టింది వాటి
పళ్ళు ఎవరు తింటారు,
వాటి కొమ్మలు
ఎవరికి కావాలి.

భుజాన చెయ్యి వేసి
పలకరింపులు మాత్రాన
లోపల వున్నది తెలిసేదేలా?
మేడిపండు లోపల పురుగులే కదా.

తక్కువ జాతి వాడని
తప్పక పిలిచిన
లోపల రగిలే జాతాగ్ని
అంతారాలను దొలిచే స్తుంటే
హీనుడు, దీనుడు అనే భావన
అగ్ని పర్వతమై హృదయాలల్లో
బ్రద్దలౌతుంటే
సామరస్య భావానికి చోటేది.

మనిషి అంతరాలయములో
అంతరాలు సమసిపోవాలి
అంతరాలు కూకటి వ్రేళ్లుతో
ఊడి పోవాలి
మనిషిని మనిషి ప్రేమించుకోవాలి
నేల మీదన్నప్పుడే అది జరగాలి

-విశ్వనాథ నరసింహం
9490971589

తెలం'గానం....

పిడికిళ్ళలో నిప్పు కణికలనందుకొని
కాలికి గజ్జెలు,జబ్బకు డప్పును ఏసుకొని
ఉద్యమ గడ్డకు నినాదాల పాటల
పూతలు పూయించిన
ఆ కమ్మటి కోయిలల జాడ కానొస్తలే
పచ్చని అడవిని నమ్మిన వాటికి
నిప్పుల వాన కాటేసింది.

పిట్ట కథలతో అల్లిబొల్లి మాటలతో
దోచుకుంటూ దాచుకున్నారని
తేటనీరును విడమరిచి విడమరిచి
వివరించే ఆ మేధావుల వేదికలెక్కడ
మొద్దునిద్రతో గురకలు పెట్టిన మెదళ్లను
సూదిమొన మాదిరి
పదునెక్కించిన ప్రశ్నలెక్కడ.

కూతవెట్టిన కోడిపిల్లల
బతుకును రోజుకొక్క తీరుగా
నంజుకు తింటున్న రాజకీయ రాబందుల
సోకును చూసి మళ్ళోకపారి
ఒక్క పాటతోనైనా గుదుపనందుకొని
తరుమాలంటున్నది నిన్నటి గాయం.

సిరిసంపదలు గల నేలలో
ఊరవతల అమరుల త్యాగాలు
కన్నీటి బొట్టులై ఆర్థిస్తున్నాయి.
కంచెమీద ఎర్రటి గుడ్డలు
జెండాలై రెపరెపలాడుతూ
యావత్తు జనసమూహం కోరస్
అందుకునేట్లు మళ్ళొక్కపారి
పాటందుకోమంటున్నాయి.

తెచ్చిన అంబలిగంప
అందరికి అందేటట్టు
ఓ పాటందుకోమని
గెట్టుమీద
సెట్టు కొమ్మల సాటున కూసున్న
నేటి కోయిలలు ఎదురుచూస్తున్నాయి...

నలుమూలల విస్తరించే
ఉద్యమ పాటవై
మళ్ళీ మళ్ళీ వర్ధిల్లు తల్లీ !!
జై తెలంగాణ ..
జై జై తెలం'గాన ....
- రామ్ పెరుమాండ్ల

శ్రమ

శ్రావ్యతను చేకూర్చే - శ్రావణ పూర్ణిమ - శ్రమ
శ్రద్ధతోనే అడుగు ముందుకు వేసే - అనుపమ - శ్రమ
శోచనీయంగా వుండ నివ్వని - ధీమ - శ్రమ
శోదించి సాధించేలా చేసే - నిరుపమ - శ్రమ
శంకలకు తావివ్వ నివ్వని - శంభము - శ్రమ
శబ్దము విని - సన్నద్ధమయ్యేలా చేసే - శస్త్రం - శ్రమ
శక్యము కానిది - ఏదీ లేదని తెలిపే - విద్రుమ - శ్రమ
శాస్త్రమును అధిగమించ నివ్వని - శిఖాతరువు - శ్రమ.
శార్దూలము మీద పడుతున్నా - చలించ నివ్వని - శాసనం - శ్రమ
శాపనార్థాలు పెడుతున్నా సరే - జంకు బొంకు లేని - సరిగమ - శ్రమ
శాంతి పథంలో పయనిస్తూ- పగలే వెన్నెల కాయించే
సూచరిత పూర్ణిమ - శ్రమ
శంబరుడిని కూడా ప్రణామమిల్లేలా చసే - చందమామ - శ్రమ
అశక్తుడిని కూడా - శక్తిమంతుడిగా తీర్చిదిద్దే - శ్రీరామ - శ్రమ
శనీశ్వరుడు కూడా - శతామానం భవతి అందించే - మధురిమ - శ్రమ
అన్ని వేళల్లోనూ
వెన్నంటే వుంటూ స్నేహ రేఖల చేయాతను -
గంగా ప్రవాహంలా పరవశింపచేసే
పట్టుకొమ్మ - శ్రమ

-లంకా వెంకట సుబ్రహ్మణ్యం
సెల్: 94404 48650

ఆవుకు వందనం

కథ

కందెనవోలు రాజ్యం పశ్చిమ ప్రాంతంలో అంజనప్ప అనే రైతు ఉండేవాడు. ఆయనకు పశువులంటే ప్రాణం. ఎద్దులు, బర్రెలు, ఆవులు, కోళ్లు పెంచుతుండేవాడు. ఎండాకాలంలో నీటి కరువు వచ్చేది. అయినా దూర ప్రాంతం నుండి నీటిని తెచ్చి దాహం తీర్చేవాడు. పశువులకు కూడా ఆయనంటే చాలా ఇష్టం. ఆయన పిలుపుతోనే సరైన దారిలో నడిచేవి.

హాయిగా సాగుతున్న జీవితం లో పిడుగు లాంటి మాటలు వినపడ్డాయి పశువులకు. "బర్రెలను అంత తక్కువ ధరకు అమ్మను. ఆవులను కబేళాకు పంపించనని" తమ యజమాని వ్యాపారికి కరాకండిగా చెప్పాడు. వ్యాపారి వెళ్లిపోయాడు. పశువులు ఊపిరి పీల్చుకున్నాయి.

తమను అమ్మడానికి కారణం 'ఏ పంట వేసినా సరైన సమయం లో వర్షాలు పడక, నష్టాలు రావడం. అప్పులు ఎక్కువ కావడం' అని మాటల ద్వారా తెలుసుకు న్నాయి.

ఎలాగైనా సరే తమ యజమా నికి సహాయం చేయాలనుకుంది ఒక ఆవు. "మనలను ఇంత బాగా చూసుకుంటున్న యజమానికి మన వంతుగా సహాయం చేయాలి. మీరు ఎలా సహాయం చేయ గలర"ని పక్కలో ఉన్న ఎద్దులను అడిగింది.

"అవును మన యజమానికి ఏదో ఒకటి చేయాలి. మేము అలసిపోకుండా మరింత పని చేస్తాం. పక్కవారి పొలంలో కూడా పనిచేసి,ధనం సంపాదించి మా వంతు ఆదుకుంటాం" అన్నాయి ఎద్దులు.

"మాకూ సహాయం చేయాలనే ఉంది. మన వల్ల కష్టాలు తీరుతాయా? మా చేతనైనంత మేమైతే మరిన్ని పాలను ఇవ్వగలం"అన్నాయి బర్రెలు ఆవు వైపు చూస్తూ.

పశువుల పాక నుండి బయటికి వచ్చి చూస్తే అక్కడే తిరుగుతున్న కోడి కనిపించింది. "మన యజమాని ఇబ్బందుల్లో ఉన్నాడు. నువ్వు ఏ విధంగా సహాయ పడతావ్" అని కోడిని కోరింది ఆవు. "నేను మరిన్ని గుడ్లను పొదిగగలను. పందెం పుంజులను పొదిగేలా సహాయ పడగలను"అంది కోడి.

ఎద్దులు, బర్రెలు, కోళ్లు చేస్తామనే సహాయం ఏమాత్రం సరిపోదని మరికొంత ముందుకు కదిలింది ఆవు.

కుక్క కనిపించింది. దానికీ విషయం చెప్పింది. "నేను నిరంతరం నిద్ర మేల్కొని ఇంటినీ, పంటను దొంగల పాలు కాకుండా కాపాడగ లను. పంటను అడవిపందుల బెడదనుంచి రక్షించగలను" అంది కుక్క. కొంత దూరంలో పిల్లి కనిపించింది. పిల్లిని కూడా అడిగింది ఆవు. "నేనేం చేయగలను అయినా సరే ధాన్యాన్ని, పంటను ఎలుకల నుండి కొక్కుల నుండి రక్షిస్తాను" అంది పిల్లి.

మేతమేయడానికి పొలాల వైపు వెళుతుండగా తనతో పాటు వస్తున్న మరో ఆవు "మనతో కూడా ఏమౌ తుంది. కొన్ని ఎక్కువ పాలు ఇవ్వ గలం. మంచి దూడలను అందివ్వ గలం. అంతే కదా" అంది ఆవుతో.

'అవును ఎద్దులు, బర్రెలు, కోళ్లు, కుక్క, పిల్లి మనం నిత్యం చేస్తున్న సహాయాలే. వాటి వల్ల కొంత లాభం ఉండవచ్చేమో కానీ మన యజమాని కష్టాలు తీరకపోవచ్చు'' అని ఆలోచనలతో ముందుకు నడిచాయి ఆవులు.

మేత కోసం చాలా దూరం వెళ్ళవలసి వచ్చింది. అక్కడ కొత్త ఆవు కనిపించింది.

'ఏ పుట్టలో ఏ పాము ఉందో' ఎవరి ఆలోచనలు ఎలా ఉంటాయో! దీనిని అడిగితే కష్టం తీరే దారి దొరుకుతుందేమో అనుకొని "ఊరికి కొత్తగా వచ్చావా? మా యజమాని పరిస్థితి దయనీయంగా ఉంది. గండం నుండి గట్టెక్కే మార్గం నీవేమైనా చెబుతావేమోనని అడుగు తున్నాను" అంది ఆవు.

"మా పాత యజమాని పరిస్థితి కూడా ఇలాంటిదే.

అందుకే నన్నూ మిగతా పశు వులను అమ్మేశాడు. మీ యజమాని కూడా మిమ్మల్ని అమ్మితే కొంతదనం వస్తుంది.కొంత కష్టం తీరుతుంది కదా" అంది కొత్త ఆవు.

''అవును మీరు చెప్పింది నిజమే" అని ముందుకు కదిలింది ఆవు. కొత్తావు చెప్పింది నిజమే కానీ యజమానికి దూరమవ్వడం ఇష్టం లేదు దానికి.

కొద్ది సేపటికి ఉరుములు మెరుపులతో వర్షం పడి వెలిసింది. పొలాల నిండా జనం చేరిపోయారు. ఇంటికి బయలుదేరాయి ఆవులు. ఒకచోట ఏదో రాయి కనపడితే తన గిట్టలో ఇరికించుకొని బురద కాళ్లతో ఇంటికి చేరింది ఆవు. కాళ్ళ బురద తీయడానికి అంజనప్ప నీళ్లతో వచ్చాడు. కడుగుతుండగా కాళ్ళ గిట్టల మధ్య తళుక్కున మెరిసింది. బాగా కడిగి జాగ్రత్తగా దాన్ని తీశాడు. తేరిపార చూసి భార్యను కేక వేస్తూ ఇంట్లోకి వెళ్ళాడు. అంజనప్ప ఆనందంలో మునిగిపోయాడు.

తొలకరి చినుకుల సమయంలో ఆ చుట్టుపక్కల గ్రామాల్లో వజ్రాలు దొరుకుతాయి. వజ్రాల వేట కోసం ఎక్కడెక్కడ నుంచో ప్రజలు వస్తూ ఉ ంటారు.

ఇది వజ్రమో కాదోనని వజ్రాల వ్యాపారి దగ్గరకు పరుగుపరుగున వెళ్లాడు అంజనప్ప. పరీక్షించగా అది నిజంగా వజ్రమని తేలింది. తమ కష్టాలు తీర్చిన ఆవుకు వందనం చేసింది అంజనప్ప కుటుంబం. యజ మాని బాధను తీర్చినందుకు ఆవుకు సంతృప్తి కలిగింది. అంతకుమించి యజమానికి దూరం అవ్వనందుకు సంతోషించాయి పశువులు.

హాయిగా సాగుతున్న జీవితంలో పిడుగు లాంటి మాటలు వినపడ్డాయి పశువులకు. "బర్రెలను అంత తక్కువ ధరకు అమ్మను. ఆవులను కబేళాకు పంపించనని" తమ యజమాని వ్యాపారికి కరాకండిగా చెప్పాడు.

-ఆవుల
చక్రపాణి యాదవ్
9963350973

ఆవహించుగాక

ఎందరో పుడుతున్నరు
కాలంలో కలిసిపోతున్నరు
కొందరు మాత్రం
చెరిగిపోనంత ప్రభావంతో
చెరపలేనంత ప్రజ్ఞానంతో
కాలం పై తమ ముద్రని
మిగిల్చి పోతరు....
తామే ఓ చరిత్ర అయి
చరిత్రలో నిల్చిపోతరు
కొందరికి పుట్టుకే పండగ
కొందరికి చావే పండగ
రెండింటి మధ్యలోని
సార్థక జీవనమే నిన్నైనా
నన్నైనా చరిత్రలో నిలబెట్టేది
రాముడు దేవుడయ్యాడు
ధర్మ జీవనం వల్లనే
రాణా ప్రతాప్ వీరుడయ్యాడు
కర్మ జీవనం వల్లనే
ఓ శివాజీ... ఓ భగత్ సింగ్
ఒక్కొక్కరిది ఓ త్యాగమయం
ఒక్కొక్కరిది ఒక్కో జీవనముద్ర
చరిత్రలో నిలిచిపోయారు
వారి వారసత్వమే మనదీ
వారి ఆత్మతత్వమే మనదీ
ఆ అమరుల అత్మలన్ని
140 కోట్ల నా దేశవాసుల్ని
ఆవహించుగాక..

- సాకి
9951172002

దేవదూతలు

ప్రశాంత సుందర వదనములు,
పెదవులపై చెదరని చిరునగవులు,
స్వచ్ఛత నిండిన హృదయములు,
నిస్వార్థ సేవకు ప్రతీకలు నర్సులు!
స్వీయ, కుటుంబ పరిరక్షణను మించి,
అన్నపానాలు, నిద్రాహారాలు మరచి,
బాధితుల సేవయే బాధ్యతగ తలచి,
అహర్నిశలు చేసేరు రోగులకు సేవలు!
జాతి, కుల, మత భేదాలెంచనివారు,
బీదా గొప్పా తారతమ్యాలెంచనివారు,
మానవసేవే మాధవసేవగా తలచేవారు,
కర్తవ్యనిర్వహణాబద్ధులై చేసేరు సపర్యలు!
అవమాన, అవరోధాలను లెక్కజేయని వారు,
తమపై దాడులను ఓర్పుతో భరించెడి వారు,
రోగులను ఆప్యాయతతో పలుకరించెడి వారు,
సహనానికి మారు పేరనిపించేరు నర్సులు!
పెను విపత్తులు సంభవించిన తరుణాన,
మహమ్మారి లోకాన్ని కబళించిన క్షణాన,
మొక్కవోని ధైర్యంతో చేసేరు జనప్రాణరక్షణ,
ప్రజా సేవయే తక్షణ కర్తవ్యమని భావించేరు!
తాము కరుగుతూ వెలుగునొసగే క్రొవ్వొత్తులు,
త్యాగమయి ఫ్లారెన్స్ నైటింగేల్ ప్రతిరూపాలు,
'సిస్టర్' అని ఎల్లరూ ప్రేమగా పిలిచే నర్సులు,
దివి నుండి భువికి తరలివచ్చిన దేవదూతలు!

-దినవహి సత్యవతి
9790752180

సింహాసనం

తన భుజాల పైకి తన పిల్లలను ఎత్తుకుంటూ
ఉన్నత శిఖరాలను తన పిల్లలు అందుకోవాలని ఆశిస్తాడు
నాన్న ఎప్పటికీ ఎవరికీ అందని ఎత్తైన సింహాసనం...

తన చిటికెన వేలు పట్టుకుని మనలను నడిపిస్తూ
మంచి నడవడికను పిల్లలకు నేర్పే దిక్సూచి అవుతాడు
నాన్న దారి చూపే మార్గానికి ఒక దర్శకుడు...

నిరంతరం మన ఉన్నతి కోసం ఎంతగానో ఆలోచిస్తూ
మనకు వెలుగులు పంచే పసిడి దివ్వె అవుతాడు
నాన్న జ్ఞాన జ్యోతులను వెలిగించే దీపానికి ఆదర్శం...

తన గుండెలపై నిరంతరం ఏడుపు లేకుండా ఆడిస్తూ
తన్నినా కూడా ఎంతో చెప్పలేని ఆనందం పొందుతాడు
నాన్న మనలను ఎన్నటికీ వదలని ఆత్మీయ బంధువు...

కుటుంబం కోసం అనునిత్యం ఎన్నో కష్టాలు పడుతూ
తన బాధను ఎవరికీ చెప్పక గుండెల్లో దాచుకుంటాడు
నాన్న ఎల్లప్పుడూ శ్రమించి కష్టపడే కష్టజీవైన ప్రేమమూర్తి....

పంచభూతాల యొక్క తత్వం తనలో కలిగి ఉంటూ
పంచభూతాత్మక రూపమైన శరీరాన్ని మనకు ప్రసాదించే దాత
నాన్న నూతన సృష్టికి కారణమైన సరైన వారధి...

-వలిపే సత్యనీలిమ
9502156813

నానీలు

కునుకు
రావడం లేదన్న.
ఊయలగా చేసిందమ్మ.
తన చిరుగుల చీరతొ.

జోలపాట పాడుతుంది
అమ్మ.
తన
కనురెప్పల సవ్వడితో.

దురైధ్యమైన
రక్షక వలయం
నా సామ్రాజ్యం
అది అమ్మ ఒడి.

-రాము కోలా, 9849001201

మారిన ధీర

కథ

ఒక అడివిలో బంటితోడేలు పిల్ల, చంటి కోతిపిల్ల చాలా చక్కగా ఆడుకునేవి. అడవంతా కలయ తిరుగుతూ అన్నిటితో స్నేహంగా మసులుతూ ఉండేవి. ఇవి ఆనందంగా గడపడం ధీర అనే తోడేలు పిల్లకు నచ్చేది కాదు .ఎలాగైనా చంటి, బంటిని విడదీయాలని రకరకాల పథకాలు రచించేది. స్నేహం కోసం ప్రాణం ఇచ్చే చంటిబంటి దగ్గర ధీర పథకాలు సాగేవి కాదు. ప్రతిసారి ధీరకు నిరాశ ఎదురయ్యేది దానితో మరింత ద్వేషాన్ని పెంచుకున్నది ఏదో రకంగా వాటిని కించపరచాలని నలుగురిలో వాటి స్నేహాన్ని హేళన చేయాలని ఎదురుచూసేది. ఈ విషయంలో తనకు సాయం చేయమని కర్ణ అనే కాకిని కోరింది. తోడేలు గుణం తెలిసిన కాకి ససే మీర అంది. నిన్ను స్నేహితుడిగా కలలో కూడా అనుకోను తోడేలు బావ.. అందరూ కలిసిమెలిసి ఉండాలని ఆశించే నేనెక్కడ అందరినీ విడదీసి చంపి తినాలని చూసే నువ్వెక్కడ కాసిని ఎంగిలి మెతుకులు దొరికిన అందరూ కలిసి పంచుకు తినాలని కోరుకునేదాన్ని అయినా ఇలాంటి విషయాలు నీలాంటి వారికి అర్థం కాదులే.కుటిల బుద్ధితో నువ్వు చేసే స్నేహం కన్నా నిస్వార్థంగా చంటి బంటి పంచే అభిమానం ధనం మిన్న నాకు, వెళ్ళు వెళ్ళు ఇక్కడి నుండి అని కసిరింది. వలవల ఏడ్చింది ధీర నేస్తమా నువ్వే అలా అంటే ఎలా... నాకు సాయం చేసేవారు ఎవరు అంది. కలిసి బ్రతకాలనుకోవాలి విడదీసి వేడుకలు చూడాలి అనుకొనే వారితోస్నేహం చేయను అంది కర్ణ.

వీరిద్దరి సంభాషణ వింటున్న తేజు అనే ఉడత.. ధీర వారి స్నేహాన్ని విడదీయడానికి ప్రయత్నించావు. ఎన్నో ఎత్తులు వేశావు. సాగలేదని రుస రుసలాడుతున్నావ్. నీవు ఎత్తులు వేసిన ప్రతిసారి నీకు హాని చేయాలనుకోలేదు. పగతో రగిలిపోతున్నావే కానీ చంటి బంటికి ఉన్న క్షమాగుణాన్ని అలవర్చుకోలేకపోతున్నావు.కాస్త ఆలోచించు ఎన్నిసార్లు వాటి మనసును గాయపరిచావు అయినా నిన్ను ఏమీ అనలేదు. ఒకసారి నీ ద్వేషాన్ని పక్కనపెట్టి స్నేహంగా మసులుకోవడానికి ప్రయత్నించు సంతోషంగా జీవిస్తావు అని హితవు చెప్పింది మారిన ధీర నేను చాలా తప్పుగా ప్రవర్తించాను. నన్ను మన్నించి చంటి,బంటినాతో స్నేహం చేస్తాయా అని అనుమానంగా అడిగింది. అనుకోకుండా అక్కడికి వచ్చి ధీర మాటలు విన్న చంటి బండి ఓ బేశుగ్గా మిత్రమా అన్నాయి. అందరి మోమున ఆనందం విరిసింది

-సి.హేమలత
9666779103

పుస్తక సమీక్ష

కర్ణాటక సంగీత మార్గదర్శి-వింజమూరి వరదరాజ అయ్యంగార్

సంగీత, సాహిత్య పరమైన సూచనా, పాఠ్య, విజ్ఞాన గ్రంథంగా శ్రీమతి వింజమూరి సంధ్య కర్ణాటక సంగీత మార్గదర్శి వింజమూరి వరదరాజ అయ్యం గార్, అనితర సాధ్యమైన ప్రతిభను వ్యక్తం చేసే 'కర్ణాటక సంగీత మార్గదర్శి వింజమూరి, ఆకాశవాణి శాస్త్రీయ సంగీత ప్రసార ఆవిష్కర్త గ్రంథాన్ని వెలువరించారు. వరదరాజ అయ్యంగార్ దక్షిణాది కర్ణాటక సంగీత ప్రాశస్త్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన లబ్ధ ప్రతిష్ఠులు. సంగీత లక్ష్య, లక్షణ విజ్ఞత కలిగిన ఆరాధకునిగా, ఆకాశవా ణిలో భక్తిరంజని, సంగీత రూప కాలు, సంబంధిత ప్రసంగాలు, వివిధ వాగ్గేయకారుల పరిచ యాలు, కృతులను వెలుగులోకి తీసుకురావడం, సంగీత శిక్షణ, రాగలక్షణ వివరాలు ఎన్నో ప్రసా రాల ద్వారా సంగీత కళా సర స్వతిని ఆరాధించారు. గానకళా నిధిగా సుపరిచితులైన వరదరాజ అయ్యంగార్, జీవన సాఫల్యత, జీవన ప్రస్థానంతో పాటుగా, శాస్త్ర అధ్యాపకులకు, పరిశోధకులకు,



విద్యార్థులకు, యువ కళాకారులకు సంగీత లోకానికి మహోపకారం అందే దీక్షాదక్షతల నిరంతర ప్రయాసతో శ్రీమతి సంధ్య ఈ గ్రంథాన్ని తీర్చిదిద్దారు. ఎటువంటి క్లిష్టరాగమయినా ఆశువుగా మధుర గానంతో శ్రోతలను పరవశింప చేయగల ప్రజ్ఞగల అయ్యంగార్, సంస్కృతంలో మంత్ర పూరితమైన నవావరణ, నవరాత్రి కృతులను కూడా అధ్యయనం చేసిన ప్రతిభతో ఎటువంటి రచనకైనా ఆశువుగా వర్ణమెట్టుకట్టి నేర్పించగల అరుదైన స్థిత ప్రజ్ఞత సాధించారు. భక్తిరంజని కార్యక్రమ పట్టిక, సంగీత ప్రసంగాలలో ప్రాతఃస్మరణీయుల వాగ్గేయకారుల రచనా వైశిష్ట్యం, సంగీతోద్ధారకుల విశేషాలు, రూపక అధ్యాయంలో త్యాగరాజ క్షేత్రయ, సాహోజీ, రామదాసు, శేషాచలదాసు ఎందరో మహనీయుల రచనలు, అన్నమాచార్య, మహారాజాస్వాతి తిరునాళ్, వాలా జీపేట వెంకటరమణ భాగవతార్ వంటి విద్వాంసుల సత్కృషి, సంచికా, సమ్మేళన, గోష్ఠి, కచ్చేరీ సాంప్రదాయ విశేషాలు, 65 రాగాల అపురూప లక్షణాలు, ఈ ఉద్గ్రంథంలో చోటు చేసుకొన్నాయి. అనుబంధంలో 1939-1956 ఆకాశవాణి కచ్చేరీలు, ప్రముఖుల లేఖలు, అనుభవాలు, గ్రంథ పరిచయాలు, అపూర్వ ప్రసారాలు, సమీక్షలు, రేడియో కళాకారులు సంగీత సర్వస్వంగా రచయిత్రి సత్కృషి, దీక్షాదక్షతలు పరిశోధన సంపాదక సామ ర్థ్యాన్ని ఈ గ్రంథం వ్యక్తం చేస్తోంది. హైద రాబాద్ ఆకాశవాణి శాస్త్రీయ సంగీత విభాగ ఉన్నతాధికా రిగా, మొట్టమొ దటి సంగీత కళాశాల వ్యవస్థాపకు నిగా, కర్ణాటక సంగీత విద్యాపాఠ్య ప్రణాళిక, నిర్మాణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన వరదరాజ అయ్యంగార్, దక్షిణా దిన శాస్త్రీయ సంగీత ప్రాచుర్యానికి జీవం అందించారు. శాస్త్రీయ సంగీత కళా తపస్వి గా, ఋషితుల్యులైన వరదరాజ అయ్యంగార్, కారణ జన్మునిగా గానకళా నిధిగా, దక్షిణ భారతా వనిలో అగ్రశ్రేణి కళాకారునిగా 1937 నుండి 1956 వరకు, 1956 నుండి 1966 వరకు, ఆకాశ వాణి ప్రసార వేదికగా ఎన్నో సృజనా త్మక విశేషాలు, కళాకా రుల ప్రముఖుల ముఖచిత్రాలు, రాత ప్రతులపై వివరాలు సంగీత సర్వస్వం భావితరాలకు ఒక బృహత్ పరిశోధనా గ్రంథాన్ని సంధ్యా వింజమూరి, తండ్రి పట్ల ప్రేమానురక్తి, భక్తి తత్పరతతో అందించడం అభినందనీయం.

ప్రతులకు:
సంధ్యా ఎల్. వింజమూరి
17 నాగరత్నం నగర్
తిరునీర్మలై రోడ్
వెస్ట్ తాంబరం
చెన్నై-600 045.
సెల్: 91766 41308

-జయసూర్య
సెల్:9014948336



గుళ్ళకమ్మ రచయితల సంఘం ఆధ్వర్యంలో
దుగ్గినపల్లి ఎజ్రాశాస్త్రి రచించిన
'గంగజాతర'
(నవలిక)
ఆవిష్కరణ సభ
తేది: 4-11-2023 శనివారం ఉదయం : గం. 10:00 లకు
స్థలం : ప్రెస్ క్లబ్, ఒంగోలు
సభా కార్యక్రమం
సభా ఆహ్వానం : చప్పిడి కోటేశ్వరరావు, బహుజనకెరటాలు
సభాధ్యక్షులు : శ్రీరామకవచం సాగర్, ప్రముఖ కవి, రచయిత
ముఖ్య అతిథులు : ఆచార్య కె.వి.ఎస్.రాజు, ఓ.ఎస్.డి., ఆంధ్రకేశరి విశ్వవిద్యాలయం
నీలం నాగేంద్రరావు
దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు
తేళ్ల అరుణ, ప్రముఖ రచయిత్రి
వక్తలు : డా॥ బద్దెపూడి జయరావు, ప్రఖ్యాత కవి
చావలి సుధాకర్, ఒ.పి.డి.యర్.
బొంత ఏసుదాసు, ఎం.ఇ.ఎఫ్. రాష్ట్ర నాయకులు
పాలడుగు రమేష్, జై భీమ్ పాంథర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు
అంగలకుర్తి ప్రసాద్, కళల దండోరా
డా॥ మొగిలి ప్రసాద్, ప్రఖ్యాత కవి
తొరటి ఆనంద్ మాదిగ, ఎం.ఎస్.ఎఫ్. జిల్లా అధ్యక్షులు
కొమ్ము సుజన్ మాదిగ, ఎం.ఎస్.పి.ఎస్. రాష్ట్ర అధ్యక్షులు
పంబిటి వీరాస్వామి, ప్రముఖ కవి
నిర్వహణ : గుళ్ళకమ్మ రచయితల సంఘం - ఆంధ్రప్రదేశ్

కనుమరుగవుతున్న చేనేత కళ

మనిషి పుట్టినప్పటి నుంచి మరణించేవరకు బట్టల ఆవశ్యకత గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

మానవాళికి వస్త్రాన్ని అందించడమే కాకుండా అగ్గిపెట్టెలో పట్టే ఆరడుగుల చీరను నేసి ప్రపంచాన్ని అబ్బురపరచిన చరిత్ర మన చేనేత కళాకారులది.

మనిషి జీవించాలంటే కూడు, గూడు, గుడ్డ, నీరు ఎంతో ప్రధానం. ప్రపంచానికి ఆహారాన్ని అందించే రైతన్న ఎంత అవసరమో, వస్త్రాన్ని అందించే నేతన్న కూడా అంతే అవసరముందనడంలో అతిశయోక్తిలేదు. మనిషి పుట్టినప్పటి నుంచి మరణించేవరకు బట్టల ఆవశ్యకత గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మానవాళికి వస్త్రాన్ని అందించడమే కాకుండా అగ్గిపెట్టెలో పట్టే ఆరడుగుల చీరను నేసి ప్రపంచాన్ని అబ్బురపరచిన చరిత్ర మన చేనేత కళాకారులది. చేతి నైపుణ్యంతో అందమైన చీరలను సృష్టించడం నేతన్నకు మాత్రమే సాధ్యం.

భారతీయత సాంస్కృతిక కళలలో ఒకటైన చేనేత కళ ప్రపంచానికే ఆదర్శం, మరియు మన దేశానికి గర్వకారణం.

స్వాతంత్ర్య ఉద్యమంలో చేనేత పాత్ర:

భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు బ్రిటిష్ ప్రభుత్వం మన దేశంలో పండించిన పత్తిని చౌకగా కొనుగోలుచేసి విదేశాలకు ఎగుమతి చేసేది. అంతేకాకుండా విదేశాలలో తయారైన వస్త్రాలను మన దేశంలో పన్నులు మినహాయించి విక్రయించేవారు. బ్రిటిష్ ప్రభుత్వం విదేశీ వస్త్రాలకు పన్నులు మినహాయించి దేశీయ వస్త్ర పరిశ్రమలపై పన్ను భారాన్ని పెంచింది. బ్రిటిష్ ప్రభుత్వ విధానాలతో భారతదేశ వస్త్ర పరిశ్రమ పతనమైంది. దింతో స్వాతంత్ర్య ఉద్యమంలో విదేశీ వస్త్ర బహిష్కరణ నినాదం చేరింది. మహాత్మగాంధీ రాట్నంపై నూలు వడికి దేశ ప్రజలకు స్వదేశీ వస్త్రాలనే ధరించాలని ఇచ్చిన పిలుపు ఉద్యమానికి ఊతమిచ్చింది. 1905 ఆగస్టు 7న కలకత్తా టౌన్ హాలులో నిర్వహించిన భారీ సమావేశంలో నేతలంతా విదేశీ వస్త్రాలను బహిష్కరించి, స్వదేశీ వస్త్రాలు ధరించి దేశీయోత్పత్తుల పునరుద్ధరణకు పిలుపునిచ్చారు. బానిసత్వం వద్దు, ఆత్మగౌరవమే ముద్దు అని సాగిన స్వాతంత్ర్య ఉద్యమంలో నూలువడికే రాట్నం ప్రధాన భూమిక పోషించడమేగాక స్వాతంత్ర్య సాధనకు ఒక సాధనంగా నిలిచింది. అలా స్వాతంత్ర్య ఉద్యమానికి చేనేత రంగానికి విడదీయరాని అనుబంధం ఉంది.

విదేశాలకు ఎగుమతి మరియు చేనేత ఘనత:

మన దేశంలో వ్యవసాయం తరువాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తుంది చేనేత రంగం. 17,18 శతాబ్దాల నాటికి ప్రపంచ వస్త్ర వ్యాపారంలో 25 శాతం వాటా మన దేశానిదే అందుకు చేనేత కార్మికులను అభినందిచాల్సిన అవసరం ఎంతోఉంది. మన దేశం నుంచి 85 శాతం మేర యూరోప్‌కు వస్త్ర వ్యాపారం సాగించారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మన చేనేత కళాకారులు తమ కళను, నైపుణ్యాన్ని మెరుగుపర్చుకుంటున్నారు. అంతర్జాతీయంగా ఖ్యాతిని గడించిన తెలంగాణలోని పోచంపల్లి వస్త్రాలు అమెరికా, స్విట్జర్లాండ్, సింగపూర్, లండన్, ఆస్ట్రేలియా, జర్మనీ వంటి దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. అంతేకాకుండా సిరిపురం, వెల్లంకిలలో తయారవుతున్న కాటన్ బెడ్‌షీట్స్, డ్రెస్ మెటీరియల్స్‌కు అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉండడం గొప్ప విషయం. రాజాపేట మండలంలోని రఘునాథపురంలో తయారవుతున్న లుంగీలు ముంబయి, సూరత్‌ల నుంచి గల్ఫ్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. వ్యాపారులు ఆన్‌లైన్ వేదికగా నేరుగా అమ్మకాలు సాగిస్తున్నారు. భూదాన్ పోచంపల్లితోపాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని చౌటుప్పల్, కొయ్యలగూడెం, సంస్థాన్ నారాయణపురం, పుట్టపాక, రామన్నపేట, సిరిపురం, వెల్లంకి, చండూరు, మోత్కూరు, రాజాపేట, ఆలేరు, గుండాల, నాగారం, బోగారం వంటి వందలాది గ్రామాల్లో వేల సంఖ్యలో చేనేత కుటుంబాలు చేనేత వృత్తినే ఆధారంగా చేసుకుని జీవిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా భారతీయ చేనేత వస్త్రాలకు ప్రత్యేకించి మన తెలంగాణ పోచంపల్లి చేనేత వస్త్రాలకు విశిష్ట స్థానం ఉండటం ఒక గొప్ప విషయంగా చెప్పొచ్చు. మొదటగా ఇక్కత్ వస్త్రాలు నేసిన పోచంపల్లి నేతకార్మికులు వారి కళానైపుణ్యాన్ని తెలంగాణలోని పలు జిల్లాల లోని గ్రామాలకు వ్యాపింపజేయటం చేనేతకు కొండంత అండగా నిలిచింది. ఇక్కత్ వస్త్రాలు తెలంగాణ నుండి పలు విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు అంటే మన చేనేత కార్మికుడి కళానైపుణ్యం ఎలాంటిదో వేరుగా చెప్పనవసరం లేదు.

మన దేశంలో మరెక్కడా లేనటువంటి దరీస్‌లు వరంగల్ జిల్లా కొత్తవాడ నేతన్నలు నేయడం చాలా గొప్ప విషయం. అంతేకాదు వారి కళాత్మక నైపుణ్యానికి 2017 లో జియోగ్రాఫికల్ ఇండికేషన్ గుర్తింపు లభించడం. అభినందనీయం. లండన్ మ్యూజియంలో దరీస్‌ను ప్రదర్శనకు ఉంచడం పట్ల వరంగల్ నేతలే కాకుండా తెలుగు రాష్ట్రాల నేతలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.. ఇక్కడి నేతన్న నేసే రంగు రంగుల తివాచీలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. వరంగల్ జిల్లా కమలాపూర్ నేతన్నలు తొలిసారిగా జీన్స్ క్లాత్ తయారు చేయడంలో సరికొత్త రికార్డు సృష్టించారు. వారి కళాత్మకతను అభినందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒకప్పుడు రాజకుటుంబాలు ధరించే హిమ్రూ పట్టు చీరలు కమలాపూర్ చేనేత సొసైటీలో తయారవుతున్నాయి. వీరి ప్రతిభకు యునెస్కో విశిష్ట సంప్రదాయ వస్త్రాలలో గుర్తింపు దక్కడం గొప్ప విషయం. మహాదేవపూర్ నేతన్నలు నేసే దసలి పట్టు చీరలకు ఎంతో ప్రత్యేకత ఉంది. పట్టు పురుగుల నుంచి దారం తీసి పట్టు వస్త్రాన్ని నేస్తారు. అంతేకాదు అడవిలో లభించే సహజసిద్ధమైన రంగులతో వాటిని ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దుతారు.

ఇక్కడి నేతన్నలు దసలి పట్టు చీరలను బతికిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉత్పత్తయ్యే విభిన్న వస్త్రాలను సిద్ధిపేట గొల్లభామ చీరలు, గద్వాల చీరలు, పోచంపల్లి ఇక్కడ టెస్కో ద్వారా కొనుగోలు చేసి మార్కెట్‌లోకి పంపిస్తున్నారు. సిరిసిల్లకు చెందిన నేత కార్మికుడు నల్ల విజయ్ 27 సుగంధ ద్రవ్యాలతో పరిమళించే పట్టుచీరను తయారుచేసి సరికొత్త రికార్డు సృష్టించడమే కాక వెండి కొంగుతో, అరటి, తామర నారుతో పట్టు చీరలు తయారు చేసి అందరిని అబ్బురపరిచి తెలంగాణ సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అవార్డు సైతం అందుకున్నాడు.

చేనేత కార్మికుల కన్నీటి గాథ:

మానవాళికి వస్త్రాన్ని అందించిన నేతన్న బతుకు నేడు ఆధునిక యంత్రాలతో పోటీపడలేక ఛిద్రమైంది. ముప్వన్నెల జెండా నేసిన చేనేతకు నేడు చేయూత కరువైంది. సనాతన సంప్రదాయాలు కనుమరుగవుతున్నా.. తన సంప్రదాయ వారసత్వ వృత్తిని, కళను కాపాడుకుంటున్న నేతన్న, కళ తప్పిపోయిన బతుకీడుస్తున్నాడు. మొదటి నుంచి చేనేతగొప్పదని ఉపన్యాసాలు దంచే చాలా మంది నాయకులు వారి జీవితాలను బాగుచేసే బాధ్యత నుంచి మాత్రం తప్పించుకుంటున్నారు. మూడు పూటలు కష్టపడే నేతన్ననేడు తన బిడ్డలకు ఒక్క పూట కూడా కడుపునిండా తిండి పెట్టలేకపోతున్నాడు. అలాంటి పరిస్థితిలోనే దాదాపు స్వాతంత్ర్య అనంతరం కుటుంబాలను వదిలి నేతన్నలు పొట్ట చేత పట్టుకొని పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్రలోని షోలాపూర్, భివాండి, బొంబాయి నగరాలు కూడా దాటి గుజారాత్ రాష్ట్రంలోని సూరత్, అహ్మదాబాద్ పట్టణాలలో బట్టల మిల్లులలో రోజుకు పన్నెండు గంటలకు మించి పనిచేస్తూ ఆరోగ్యాలు చెడగొట్టుకుంటున్నారు. పిల్లలను చదివించడానికి స్థోమత లేక అదే పనిలో కొనసాగిస్తున్న కుటుంబాలెన్నో. ఎప్పటి నుండైతే వీరి వలసలు కొనసాగాయోనాటి నుండి పల్లెటూళ్ళలో మగ్గం శబ్దాలతో లయ బద్ధంగా నాట్యమాడిన నేతన్నల వీధులు నిశ్శబ్దంగా రోదిస్తున్నాయి. అటు తర్వాత జరిగిన పరిణామమే కొంత మంది నేతన్నలు అప్పులు చేసి మర మగ్గాలను తెప్పించుకున్నారు. కానీ వారికి ముడి సరుకు అందుబాటులో లేదు, వున్నా కొనుగోలు చేయడానికి కావాల్సిన డబ్బు లేదు. ఇలాంటి పరిస్థితులలో చేసిన అప్పులు తీర్చలేక తమ కుటుంబాల ఆకలి బాధను చూడలేక చాలా మంది నేతన్నలు ఆత్మ హత్యలు చేసుకున్నారు. ఇంకా మర మగ్గం మీద నేసిన సరుకు సరియైన మార్కెటింగ్ సదుపాయాలు లేక, గిట్టుబాటు ధరలేక తప్పనిసరి పరిస్థితులలో మధ్య ధళారీల దోపిడికి గురి అయి మర మగ్గానికి కూడా దూరంకావలిసిన దుస్థితి ఏర్పడింది.. కరోనా కారణంగా నేతన్న కల చెదిరినట్లయింది. అనేక నేత పరిశ్రమలు మూతపడటం వలన వృత్తినే నమ్ముకున్న నేతన్న వేరే పనిచేయలేక సతమతమవుతున్నాడు, చావుకైనా సిద్ధపడుతున్నాడు. అయినా తన వృత్తిని కాపాడుకోవటంకోసం నేతన్న అనేక విధాలుగా ప్రయత్నం చేస్తున్నాడు. ఇలాంటి పరిస్థితి కనుక కొనసాగితే భారత దేశానికి గర్వకారణమైన చేనేత కళాసంపద శాశ్వతంగా కోల్పోయే ప్రమాదమున్నది. ప్రస్తుతం పెరుగుతున్న పెట్టుబడి వ్యయం, తగ్గిపోతున్న అమ్మకాలు ఇలా ఎన్నో కారణాలచేత చేనేత రంగం కష్టాలు కన్నీళ్ల కలబోత అయింది.

గణాంకాల ప్రకారం:

ఇండియా హ్యాండ్లూమ్ సెన్సస్ (2019-20) గణాంకాల ప్రకారం, దేశంలో 26,73,891 మంది చేనేత కార్మికులు మరియు 8,48,621 మంది అనుబంధ కార్మికులు ఉన్నారు, వీరిలో 25930 మంది చేనేత కార్మికులు మరియు 21922 మంది అనుబంధ కార్మికులు మన తెలంగాణ రాష్ట్రంలో ఉన్నారు. ప్రభుత్వ అంచనా ప్రకారం 38000 మంది చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. తెలంగాణలో 47852 వేల మగ్గాలు ఉండగా ఒక్క సిరిసిల్లలోనే 34 వేల చేనేత కార్మికులున్నారు. సిరిసిల్లలో పాతికవేల కుటుంబాలు ఈ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాయి. సిరిసిల్లలో రోజుకు 34 లక్షల మీటర్ల వస్త్రం ఉత్పత్తి అవుతుంది. వివిధ పట్టణాలు, నగరాల్లో వస్త్ర తయారీ యూనిట్లలో దాదాపు 70లక్షల మంది చేనేత కార్మికులు ఉపాధి పొందుతున్నారని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 380 ప్రాథమిక చేనేత సహకార సంఘాలు ఉన్నాయి.

ఎదుర్కొంటున్న సమస్యలు:

1. కేంద్ర రాష్ట్ర బడ్జెట్లలలో సరైన నిధుల కేటాయింపులు లేకపోవడం చేనేత కార్మికులకు పెట్టుబడి ప్రధాన సమస్య అయింది. బట్టల తయారీకి సంబంధించిన ముడిసరుకు కొనాలంటే అప్పులు చేయక తప్పని పరిస్థితి, వృత్తిని నమ్ముకుని జీవనం సాగించే నేతన్నలు వారు తయారుచేసిన చీరలను అమ్ముకోలేని దుస్థితిని ఎదుర్కొంటున్నారు.

2. నేతన్నకు మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. గ్రామాల్లోని నేత కార్మికులకు ముడిసరుకు అందుబాటులో లేకపోవడంతో వాటిని కొనుగోలు చేసేందుకు ఎక్కువ దూరం ప్రయాణించవలసి రావడంతో రవాణా ఖర్చులు అదనంగా భరించాల్సి వస్తోంది.

3. ముడిసరుకు ధరలు పెరుగుదల, సిల్క్, కాటన్/నూలు, జనప, రసాయనాల ధరలు పెరగడం వల్ల కాటన్ ధరలు విపరీతంగా పెరిగాయి.

4. అన్ని సంప్రదాయ డిజైన్లను అనుకరించి కాపీ చేసి తయారుచేయడంవల్ల చేనేత పరిశ్రమ ఉత్పత్తులకు రక్షణ లేకుండా పోతోంది. అలాగే పేటెంట్ లేకపోవడంతో చేనేత పరిశ్రమకు తీవ్ర నష్టం జరుగుతుంది.

5. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉపాధి పొందాలనే ఉద్దేశ్యంతో సూరత్ నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారున్నారు. ప్రభుత్వం వారికి ఇప్పటివరకు ఎలాంటి ఉపాధి కల్పించలేకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారు.

6. చేనేత పరిశ్రమ వర్గాలు మరియు అనేక రాష్ట్రాలు కూడా పన్ను పెంపు ప్రతిపాదనను వ్యతిరేకించాయి. ముడిసరుకు ధరలు పెరగడం, ప్యాకేజింగ్, రవాణా ఖర్చులు పెరగడం వల్ల ఎంతో మంది చేనేత కార్మికుల జీవితాలు తలకిందులయ్యాయి.

ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి:

1. కేంద్ర ప్రభుత్వం చేనేతపై విధించిన జిఎస్‌టి రద్దు చెయ్యాలి, దశాబ్దాలుగా అస్తవ్యస్త విధానాలతో కుప్పకూలిన చేనేత పరిశ్రమ జీఎస్టీ పన్నుల భారంతో కొట్టుమిట్టాడుతోంది. సహజసిద్ధమైన నూలు, చేనేత వస్త్రాలను జీఎస్టీలో మినహాయించకపోతే చేనేతలకు ఉపాధి పూర్తిగా తగ్గిపోతుంది. వస్త్ర దిగుమతులు పెరుగుతాయి. జీఎస్టీపై సవివరమైన చర్చలు జరగాల్సి ఉంది. చిన్న, సన్నకారు రైతులు, చేనేత కుటుంబాల సమస్యలు, పరిష్కారాలను మిళితం చేసి సమగ్ర విధానాన్ని

రూపొందించాలి. కొత్త పన్ను విధానం వల్ల ఉపాధిని కోల్పోవడమే కాకుండా స్వతంత్ర చేనేత రంగం ఉనికిని కోల్పోతుంది. తద్వారా భారతీయ వస్త్ర పరిశ్రమ విదేశీ ఉత్పత్తులపై ఆధారపడాల్సిన పరిస్థితి వస్తుంది.

2. 1985లో అప్పటి ప్రభుత్వం చేనేత రిజర్వేషన్ చట్టాన్ని తీసుకొచ్చి చేనేత కళాకారులు మగ్గం పైనే 22 రకాల వస్త్రాలను తయారుచేయాలని ఆమోదించారు. తర్వాత కేంద్రం 11 రకాల ఉత్పత్తులకు కుదించింది. ప్రస్తుతం ఉన్న 11 రకాల ఉత్పత్తులను పరిరక్షించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి. చేనేతకు కేటాయించిన 11 రకాల ఉత్పత్తులను ఖచ్చితంగా అమలు జరపాలి. ఉల్లంఘించిన పవర్‌లూమ్ యజమాన్యాల పై చర్యలు తీసుకోవాలి. ఎన్‌హెచ్‌డిసి ద్వారా నూలు సప్లయి చేయాలి.

3. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలలో సరైన నిధులు కేటాయించాలి.

4. చేనేత కార్మికుడిగా గుర్తింపు కార్డు ఉన్నవాళ్ళకి మాత్రమే చేనేత రుణాలు ఇవ్వాలి.

5. చేనేత కార్మికులు తయారుచేసిన వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

6. రాజ్యాంగం ప్రకారం చేనేత కార్మికులకు స్వయం ఉపాధి కల్పించాలి.

7. తెలుగు రాష్ట్రాల్లో స్పిన్నింగ్ పరిశ్రమలు లేకపోవడంతో ఇక్కడి రైతులు పండించే నాణ్యమైన పత్తిని స్పిన్నింగ్ పరిశ్రమలు ఉన్న కోయంబత్తూరు, చెన్నై వంటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. అంతేకాదు అక్కడి పరిశ్రమల్లో తయారైన నూలును తీసుకొచ్చి విక్రయిస్తే రవాణా చార్జీలతో పాటు ధర కూడా పెరుగుతుంది. అందువల్ల మన రాష్ట్రంలో స్పిన్నింగ్ పరిశ్రమను ఏర్పాటు చేయడం వల్ల సామాన్యులకు ధర అందుబాటులో ఉంటుంది. తక్షణమే ప్రభుత్వం స్పిన్నింగ్ పరిశ్రమ ఏర్పాటుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

8. చేనేత గుర్తింపు కార్డు ఉన్నవారికి ప్రభుత్వం సబ్సిడీపై మరమగ్గాలు అందించాలి. కనుమరుగైపోతున్న చేనేత వృత్తిని కాపాడాలి.

ఎన్నికల సమయంలో చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తానన్న ముఖ్యమంత్రి వాగ్దానం ఎప్పుడెప్పుడు నెరవేరుతుందా అని నేతన్నలు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చినట్లైతే చేనేత రంగం అభివృద్ధి చెందడమే కాక వారి పార్టీకి కూడా మంచి పేరు లభిస్తుందని చేనేత కార్మికులు వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత సమస్యలను గుర్తించి సమస్యలను రూపుమాపేందుకు పటిష్టమైన ప్రణాళికను రూపొందించి ఆదుకోవాలని చేనేత కార్మికులు కోరుకుంటున్నారు.

అంతరించిపోతున్న చేనేత కళను కాపాడుకోవలిసిన బాధ్యత మనందరిది. చేనేత వస్త్రాలు ధరిద్దాం నేతన్నలను కాపాడుకుందాం

-కోట దామోదర్
9391480475

అమ్మ మాటలు

కథ

ఒక చిన్న పక్షి ఆహారం కొరకై జొన్నకంకులపై వాలింది. అప్పుడు ఆ మంచె పైన కాపలాగా ఉన్న మనిషి ఒక డబ్బాను గట్టిగా చప్పుడు చేశాడు . అది ఆ చప్పుడుకు భయపడి పారిపోయింది.

కానీ కొద్ది సేపటికే అది ఆ ఆహారం కొరకు తిరిగి వచ్చి ఒక జొన్న కర్రపై వాలింది. అప్పుడు ఆ వ్యక్తి వెంటనే తన వద్ద గల గులేరు.... అనగా ఉండేలు బద్దను ఉపయోగించి ఒక రాయితో ఆ పక్షిని కొట్టాడు. అది తప్పించుకొని తిరిగి మళ్లీ ఆ ధాన్యాన్ని తినుటకై వచ్చింది.

ఈసారి ఆ కాపలాదారు తిరిగి తన ఉండేలు బద్దపై రాయి నుంచి గురి చూసి గట్టిగా కొట్టాడు. కానీ అది గురి తప్పింది. అప్పుడు దాన్ని చూసి అక్కడికి వచ్చిన దాని తల్లి ఆ చిన్న పక్షితో " బిడ్డా! మనకు ఇక్కడ ఉండడం క్షేమకరం కాదు. ఇంటికి వెళదాం పద " అని అంది. కానీ ఆ చిన్న పక్షి అమ్మ మాటను వినలేదు. తిరిగి ఆ వ్యక్తి మళ్లీ ఉండేలు బద్దతో ఆ చిన్న పక్షిని మళ్లీ గురి చూసి కొట్టాడు . అది ఆ చిన్నపిట్ట కాలుకు తాకి దానికి చిన్న గాయమై అది క్రింద పడిపోయింది. అప్పుడు దాని తల్లి తన బిడ్డ దగ్గరకు వచ్చి తన సేవతో దానికి కొంత ఉపశమనం కలిగించి " నేను చెబితే విన్నావా? పద ఇంటికి పోదాం . ఇంకా నయం! అదృష్ట వశాత్తు నీ రెక్కలకు గాయం కాలేదు" అని అంది. అవి రెండూ అక్కడినుంచి తమ గూడుకు ఎగిరిపోయాయి . ఆ మనిషి తన పంట దక్కినందుకు ఎంతో సంతోషించాడు

తన ఇంటికి చేరిన తర్వాత దాని తల్లి తన బిడ్డతో " చూశావా ! నేను చెబితే విన్నావు కాదు. ఆ కాపలాదారు లక్ష్యం తన పంటను కాపాడుకోవడం. ఆ ధాన్యాన్ని తినాలని నీ కోరిక. ఒకటి ,రెండుసార్లు అతని గురి తప్పింది . కాబట్టి బ్రతికి పోయావు. కానీ ఎప్పటికీ అలా జరుగుతుందని మనం ఊహించలేం కదా! అలా ప్రమాదకరంగా ఉన్న సమయంలో అక్కడికి మనం పోరాదు. . మనం వారిని అడగకుండా ధాన్యాన్ని తినాలని అనుకోవడం కూడా మన తప్పే. వారు పెడితేనే మనం తినాలి. ఒకవేళ నీ రెక్కలకు గాయాలు అయితే నీవూ, నీతో పాటు నీ మీద ప్రేమతో నేను ఇద్దరం వారికి దొరికి పోయే వారం. అందువల్ల మరొకసారి ఇటువంటి తప్పు పని చేయకు "అని మందలించింది . అప్పుడు ఆ చిన్నపక్షి సరేనంది.

తర్వాత కొద్ది రోజులకు దాని కాలిగాయం నయం అయింది. అప్పుడు తల్లి పక్షి తన బిడ్డను తనతో కూడా ఆహారం కొరకై రమ్మంది .అందుకు సరేనన్న ఆ చిన్నపక్షి తల్లితోపాటు ఆహారం కొరకై వెళ్ళింది . అవి ఒక గ్రామంలో ఒకచోట ఒక దయాశాలి పక్షుల కొరకు ప్రేమతో ధాన్యాన్ని చల్లుతున్నాడు .అక్కడ అనేక పక్షులు చేరి ఆ ధాన్యాన్ని తింటున్నాయి . అప్పుడు ఇవి కూడా అక్కడ వాలి ఆ ధాన్యాన్ని తృప్తి గా ఎటువంటి భయం లేకుండా తినసాగాయి.

అప్పుడు తల్లి పక్షి "చూశావా ! ఇది వారు ప్రేమతో పెట్టిన ఆహారం. ఇక్కడ నీకు ఏం ప్రమాదం లేదు . ఇటువంటి చోటికే వెళ్లి నీవు తినాలి . మన పక్షులన్నీ కూడా నీకు ఏదైనా ఆపద సంభవిస్తే అవి తోడుంటాయి ! కనీసం నాకు సమాచారం అయినా చెబుతాయి కదా! అయినా అమ్మతోడు లేకుండా ఒంటరిగా నీవు ఎక్కడికీ వెళ్ల కూడదు. అమ్మ మాటలు వినకుంటే నీకు ఆపదలు వస్తాయి. మేము మా అమ్మ మాటలు వినే బాగు పడ్డాం" అని అంది . అందుకు చిన్న పక్షి సరేనంది.

అందుకే పిల్లలూ! మనం కూడా అమ్మ మాటలను వినాలి. లేకుంటే కష్టాలపాలు అవుతాము.

-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535

మాతృభాషతో మానవ వికాసం

మనిషి జీవితంలోమాతృ భాష బహుముఖ పాత్ర వహిస్తుంది.మాతృ భాషతోనే మానవ వికాసం. జీవితంలో మొదట నేర్చుకునే భాష మాతృభాష తల్లి ఒడి బిడ్డకు తొలి బడి. తనతల్లి నీ అమ్మ అని పిలువు మని ఎవ్వరూ చెప్పరు ఎవరు చెప్పకుండానే అమ్మ అని పిలుస్తాడు. మాతృభాష కూడా అంతే మాతృ భాష సహజంగా అబ్బుతుంది. అమ్మ మాటే మాతృభాష అందుకే ప్రతి బిడ్డ అమ్మను కాపాడుకున్నట్లే మాతృభాషను రక్షించుకోవాలి. జీవితంలో పైకి రావాలంటే ఇతర భాషలను నేర్చుకోవాలి ఇతర భాషలను నేర్చుకోవడంలో తప్పు లేదు. కానీ వాటి ప్రభావం మాతృభాషపై పడకుండా చూసుకోవాలి. మన మాతృభాషను సంరక్షించుకోవాలి. మాతృభాషా మన సంస్కృతి సాంప్రదాయాలకు రక్షణగా నిలుస్తుంది. మన జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటుతుంది. మాతృభాష దేశభక్తిని ఐక్యతను సమగ్రతను సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తుంది. మాతృ భాషలో అధ్యయనం విజ్ఞానానికి బలమైన పునాదులు వేస్తుంది. విషయ సంగ్రహణ వివరణ విశ్లేషణ సామర్థ్యం పెంపొందించబడుతుంది.

మాతృబాష సంరక్షణ కొరకు నలుగురు బెంగాలీ యువకులు అనువులు బాశారు. వారికి కృషికిగుర్తింపుగా 1999 సం ॥ ఫిబ్రవరి 21వ తేదీని ఐక్యరాజ్య సమితి సాంస్కృతిక విషయాలు సంస్థ 1999వ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా ప్రక టించింది .

ప్రతి సంవత్సరం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా జరుపుకుంటారు 2000 సంవత్సరం నుండి ప్రతి ఏటాఅంతర్జాతీయ మాతృభాష పరిరక్షణ కార్యక్రమాన్ని యునెస్కోడైరెక్టర్ జనరల్ నిర్వహిసున్నారు.

ప్రపంచంలో ఉన్న భాషలను సంరక్షించుకోవాలి.

భాష సంస్కృత వైవిద్యాన్ని కాపాడుకోవడం ద్వారా మన జీవన వైవిధ్యాన్ని కాపాడుకోగలమని అనేక అధ్యయనాల్లో తేలింది. బహు భాషా విధానాన్ని ప్రోత్సహించాలి. మాతృ భాష శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తుందని యునెస్కో ప్రకటించింది.

మాతృభాషను కాపాడుకుంటూనే దాని ద్వారా మిగిలిన భాషలు నేర్చుకోవడం విజ్ఞానాన్ని పొందటం

దేశభాష లందు తెలుగు లెస్స అన్న కృష్ణదేవరాయల వాక్య మనకు స్ఫూర్తి కావాలి. తెలుగు భాషలోని మాధుర్యం గొప్ప తనం ప్రపంచానికి చాటాలి.

మార్గం మాతృభాషా దినోత్సవం సందర్భంగా ప్రతి ఏటా ఒక థీమ్ ను ప్రకటిస్తుంది. అభివృద్ధి శాంతిభద్రతలు సయోధ్యకుదేశభాషలు దోహదపడతాయి అనేది ఈ సంవత్సరం థీమ్. పారిస్‌లో ఉన్న యునెస్కో కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తారు.

తెలుగు భాషరక్షణ మన కర్తవ్యం

తెలుగు భాషను కాపాడుకోవడం మనందరి కర్తవ్యంకావాలి. దేశభాష లందు తెలుగు లెస్స అన్న కృష్ణదేవ రాయల వాక్య మనకు స్ఫూర్తి కావాలి. తెలుగు భాషలోని మాధుర్యం గొప్ప తనం ప్రపంచానికి చాటాలి. ప్రపంచీకరణ ప్రభావం వల్ల ప్రపంచం ఒక కుగ్రామంగా మారి డిజిటలీకరణ రాజ్యమేలుతుంది .ప్రపంచంలో దేశాల మధ్యవర్తక వాణిజ్య వ్యాపార శాస్త్ర సాంకేతిక పరిశోధన రంగాలలో సంబంధాలు పెరిగాయి.

దేశ ప్రజల మధ్య సంబంధాలు పెరిగాయి. ప్రజలుఅనేక రకాలైన జ్ఞానార్జనకోసం ఒక దేశం నుండి మరొక దేశానికి వెళ్ళడం ఉపాధి ఉద్యోగాలకై వలసలు పోవడం సర్వ సాధారణమైంది .అందువల్ల ఇంగ్లీష్ అంతర్జాతీయ భాషగా ఆమోదం పొందింది. కానీ ఇంగ్లీష్ మోజులో పడి మన మాతృభాషను నిర్లక్ష్యం చేయరాదు. మాతృ భాషలోవిద్యా బోధన వుంటే భారత దేశానికి స్వాతంత్ర్యం ఎప్పుడో వచ్చేది అని మహాత్మ గాంధీ 1938 సంవత్సరంలో పేర్కొన్నారు.

మాతృభాష మీద పట్టు వుంటే ఇతర భాషలు నేర్చుకోవడం సులభ మౌతుందని మెకంజీ వాకర్ లాంటి భాషా శాస్త్రవేత్తలు అభిప్రాయ పడ్డారు. మాతృభాష మనిషి ఆలోచన పరిధిని విస్తృతం చేసిమాన సిక వికాసానికి సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుంది. మనిషి వికాసానికి, నీతి నియమాలు నిజాయితీ 'మానవీయ విలువలు, పురాణ ఇతిహాసాలు మాతృభాషలో వుంటా యి. బాల్యదశలో త్వరగా అర్థం అవుతాయి. మాతృభాష కనుమరుగై తే మానవ మనుగడ మానవ సంబంధాలు నవాల్‌గ పరిణమిస్థాయి. ప్రపంచములో 230 భాషలు అంతరిం చాయి. ఇంకా 3వేల భాషలు అంతరించే దశలో వున్నాయని యునెస్కో వెల్లడించింది.ఈ బాషలో తెలుగు భాష వుంది. దేశములో 40 పైగా భాషలు మాండలికాలు అంతరించే ప్రమాదం వుందని అనేక అధ్యయనాలు వెల్లడించాయి.

అందమైన మన భాష సాహిత్య సంపదనుసంరక్షించుకోవాలి.

భాష సంస్కృతి భావితరాలకు వారసత్వ సంపద గా ఇవ్వడం మన కర్తవ్యంకావాలి.

అన్య భాషలు ఎన్ని నేర్చుకున్నప్పటికీ మాతృభాష మరువకూడదు. మాతృభాషలో ప్రవీణుడు కాని వాడు విజ్ఞాన సముపార్జన చేయలేడు. సుసంపన్నమైన మన భాష సాహిత్య సౌందర్యాన్ని అవగాహన చేసు కోవాలి. భావి తరాలకు భాషా సౌందర్య సంపద రక్షించడాని కి పౌర సమాజం పాటుపడాలి.ప్రపంచములో వున్న చిన్న పెద్ద భాషలను రక్షించుకోవాలని భాషా సంస్కృతి వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారా మన జీవ వైవిధ్యాన్ని కాపాడుకోగలము బహుభాషా విధానాన్ని ప్రోత్సహించాలి.మాతృ భాషను రక్షించుకుంటునే మిగతా భాషలను నేర్చుకొని అనంత విజ్ఞానాన్ని పొందడానికి ప్రయత్నించాలి ప్రభుత్వం. నూతన విద్యా విధానములో బాగంగా ప్రాథమిక విద్య స్థాయిలో మాతృ భాషలోనే బోధన కొనసాగటానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను అమలు చేయాలి మాతృ భాష సంరక్షణ మానవ మనుగడకు మార్గం కావాలి.

-నేదునూ

పుస్తక సమీక్ష

అక్షయ సాహితీ గంధం- అక్షర శిల్పులు గ్రంథం

-శ్రీమతి కె.వీణారెడ్డి,
7337058025.

ఆరంభమే కానీ అంతం లేని అనంత సాహితీ లోకంలో నిరంతరం సాహితీ సమారాధనం గావిస్తున్న శ్రీ వేదార్థం మధుసూదన శర్మ గారు నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం పెంట్లవెల్లిలో ప్రభుత్వ తెలుగు అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. వీరి స్వస్థలం ఎన్మనబెట్ల గ్రామం.

కవి,రచయిత ,పండితులు అయిన వీరు ఇప్పటివరకు అడుగుజాడలు, సాహితీ ముత్యాలు, కొల్లాపూర్ సాహితీ వైభవం, కృష్ణా నదీ మతల్లి పుష్కర శోభ, సమాలోకనం, పరంపర మొదలైన గ్రంథాలను రచించి ముద్రించారు.అదే పరంపరలో ప్రస్తుతం పాఠకులకు అందిస్తున్న గ్రంథం "అక్షర శిల్పులు".

పుస్తక పఠనం అనేది ఒక అద్భుతమైన అభిరుచి అయితే రచనా వ్యాసంగం అనేది పరమాద్భుత ప్రక్రియ. తాను చదివిన గ్రంథ రచయితల జీవిత విశేషాలను వారి గ్రంథాలలోని రచనావైదుష్యాలను, సదవగాహనతో కూడిన చక్కని వ్యాసాలుగా వ్రాయడం అనేది వేదార్థం గారందించిన వైవిధ్య సాహితీ నైవేద్యం అని చెప్పవచ్చును. రచయిత తను రాసిన, పలు పత్రికలలో ప్రచురితమైన మరియు ఆకాశవాణిలో ప్రసారమైన వ్యాసాలు ఇందులో ఉన్నాయి. తెలుగు సాహితీ రంగంలో తమ రచనల ద్వారా విశేషమైన సేవ చేసిన రచయితలు, కవుల జీవిత విశేషాలను, వారి రచనలలోని ప్రత్యేకతలను 17 వ్యాసాలతో మొదటి భాగంలో చేర్చారు. అలాగే సమకాలీనులైన వివిధ కవుల, రచయితల వైవిధ్య రచనా విశేషాలను గురించి మరో 17 వ్యాసాలను ద్వితీయ భాగంలో చేర్చి ముద్రించడం అనేది ఇక్కడ ప్రత్యేకంగా చెప్పవచ్చును. దీనికి "అక్షర శిల్పులు" అనే పేరు పెట్టడం కూడా అద్వితీయమనిపించింది.

తమ విలువైన, విలక్షణమైన, విశ్లేషణలతో పలువురు ప్రముఖులు అక్షర శిల్పులు గ్రంథానికి సాహితీ విందులా తమ ముందు మాటలు అందించడం మరో ఆసక్తిదాయక అంశం.

మొదటి భాగం లో "తెలంగాణ జాతి రత్నాలు" అనే అద్భుతమైన శీర్షికతో ఒద్దిరాజు సోదరులుగా ప్రఖ్యాతిగాంచిన ఒద్దిరాజు సీతా రామచంద్ర రావు, రాఘవ రంగా రావు గారల గురించి, స్వయంకృషితో సంగీతం, సాహిత్యం, వేద వేదాంగాలు, వ్యాకరణం, జంత్ర వాద్యం, జ్యోతిష్యం, వడ్రంగం, తాపీ పని, చర్మకార విద్య మొదలైన వాటిని ఏకసంథా గ్రాహులుగా అభ్యసించిన విధానాన్ని, తెలంగాణలో భాషా సారస్వతముల వ్యాప్తి కొరకు కృషిచేసిన వారిని మహనీయులు అంటూ, పట్టుదల, శ్రమతో కూడిన వారి జీవిత విశేషాలు, గొప్ప వ్యక్తిత్వాలు భవిష్యత్ తరాల వారికి ఆదర్శప్రాయాలని అవగాహనతో కూడిన ఆరంభ వ్యాసం లో వివరించారు శర్మగారు.

"సురవరం తెలంగాణకు వరం" అనే శీర్షికావర్ణనతో సంపాదక, పరిశోధక, పండిత రచయిత గానే కాక ఉద్యమకారుడిగా, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన తెలంగాణ తేజం సురవరం ప్రతాపరెడ్డి'' అని తెలియజేస్తూ, తెలంగాణ చరిత్రలో చరితార్థులైన వారి జీవిత విశేషాలను ఇందులో పొందుపరిచారు.

తెలంగాణలో కవులే లేరని ఆంధ్ర పండితుడు గేలి చేయగా, అందుకు ధీటైన జవాబుగా గోలకొండ కవుల సంచికను ప్రచురించి, తెలంగాణ సాహితీ అస్తిత్వానికి గుర్తింపు తెచ్చిన వైతాళికులు సురవరం గారు అంటూ, వివిధ కీలక రంగాలలోని వారి మహత్తర కృషి రేపటి తరాలకు అధ్యయనాంశం అన్న విషయాన్ని రచయిత సూచించారు.

అలాగే ప్రముఖ హరికథా జంట కవులు భట్టుపల్లి సోదరుల గురించి వివరిస్తూ, వీరిని ఉద్దేశించి జంధ్యాల పాపయ్య శాస్త్రి గారు

"జంట కవులు తెలుగు సాహితీ లక్ష్మికి
కంటి సరులు తెలుగు పంట సిరులు
నడుచు వెంట వెంట అడుగు జంట విధాన
కవుల జంట కౌతుకముల పంట" అంటూ

ప్రశంసించిన అంశాన్ని ఇక్కడ గుర్తు చేశారు. ఇంకను వారి జీవిత విశేషాలను, హరికథా రచనలను, ప్రదర్శనలను, వాటి వివరాలను, వీరి పురాణ కథా పఠనం, విలక్షణ శైలి మొదలైన వాటిని గురించి వివరిస్తూ, తెలంగాణలో గొప్ప హరికథా కళాకారులుగా పేరు తెచ్చుకున్న వైనాన్ని వెల్లడించారు. వీరి అలభ్య రచనల విషయములో మరింత పరిశోధన జరగాల్సి ఉందన్న బాధ్యతను గుర్తు చేశారు వేదార్థం గారు.

ప్రతులకు:వేదార్థం మధుసూదన శర్మ
బ్యాంక్ పక్కన
రాజా వీధి, కొల్లాపూర్(పోస్ట్)
నాగర్ కర్నూల్ (జిల్లా)
పిన్-509102
చర వాణి.9063987585.

''తెలుగు సాహితీ రత్నం వానమామలై వరదాచార్యులు'' అన్న శీర్షికతో కూడిన వ్యాసంలో, వారిని తెలుగువారు ''అభినవ పోతన'' అనేవారని అభివర్ణిస్తూ, వీరి జీవిత విశేషాలతో పాటు, రచనా విశేషాలు, పాండిత్య ప్రతిభ, సాహిత్య కృషి, అవార్డుల వివరాలు ఇంకను ఉద్యోగ, రాజకీయ నేపథ్యాలను ఎంతో విద్వత్తుతో విదితం చేశారు.

"పరిశోధనా కేసరి డా. పల్లా దుర్గయ్య" అంటూ శీర్షికాముఖంగానే ప్రస్తుతిస్తూ, వారి గంగిరెద్దు కావ్యంలోని గ్రామీణ వాతావరణాన్ని సూచిస్తూ ఎద్దుకు శిక్షణను ఇచ్చే విధానాన్ని

"కాళ్లు మోకరించి కర్రను నేలకు మోపి

పండు మనుచు భువి పరుండ జేయు" అంటూ

వర్ణించిన తీరు వారికే సాధ్యమంటూ, రసానందాన్ని కలిగించే వారి సాహితీ కృషీవలత్వాన్ని, ప్రణాళికా బద్ధమైన పరిశోధనా అంశాలను, ప్రతిభావంతులుగా పేరొందిన వారి పేరు ప్రఖ్యాతుల వెనుక వారి పట్టుదలను గురించి తెలుపుతూ, వీరి సాహిత్యం సాహితీ జిజ్ఞాసవులకు ఎంతో ఉపయోగమని ఉల్లేఖించారు.

"తెలంగాణ తొలి పొద్దు కాళోజి" అనే శీర్షిక క్రింద ఒక చురుకైన ప్రభాత కిరణాన్ని దర్శింపజేసి ప్రభావితం చేశారిలా రచయిత గారు,

''అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి..

అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి ప్రాప్తి.. అన్యాయాన్ని ఎదిరించిన వాడే నాకు ఆరాధ్యుడు" అన్న ఉద్యమ స్ఫూర్తి, సాహితీ మూర్తి కాళోజి గారిని గురించి,

''పుట్టుక నీది చావు నీది బతుకంతా దేశానిది" అనే తన మాటను, తాను ఆచరించిన వారి మహనీయతను స్ఫురింపజేసి, స్ఫూర్తింప జేశారు.

"అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు ఏ పాటి వాడో చూడు. పెట్టుకునే టోపీ కాదు, పెట్టిన టోపీ చూడు" అని హెచ్చరిస్తూ, ప్రజలను జాగ్రత్తపరిచిన వారి ఉద్యమ చేతనత్వాన్ని, ఉత్తమ కవిత్వాన్ని వ్యక్తీకరిస్తూ, వారు తెలంగాణ భాషా ప్రేమికులుగా కీర్తి గడించిన చిరస్మరణీయులు అంటూ మరోసారి వారి ధన్యజీవనాన్ని స్ఫురణకు తెచ్చారు వేదార్థం గారు.

"ప్రజల మనిషి వట్టి కోట ఆళ్వారు స్వామి" అన్న శీర్షికతో తెలంగాణ కథ, నవలా సాహిత్యం అంటే వెంటనే స్మరణకు వచ్చే పేరు వట్టి కోట ఆళ్వారు స్వామి అని వారి సాహితీ శేముషిని విశదం చేశారు. స్వాతంత్ర సమర సందర్భంలోని కారాగార వాసాన్ని, వీరు గ్రంథ పఠనానికి, మేథో మథనానికి, సాహిత్య వికాసానికి వినియోగించుకున్నారని తెలియజేశారు. తోటి ఖైదీల భాదలకు స్పందించి, "జైలు లోపల" అనే కథల సంపుటిని రచించారన్న సంగతిని విదితం చేసారు శర్మ గారు. వారు మహోన్నత వ్యక్తిత్వం, బహుముఖ ప్రజ్ఞా తత్వం కలవారని వట్టికోట గారి గురించి ఆకట్టుకునేలా గట్టి కోట కట్టిందీ వ్యాస విన్యాసం.

అలాగే "బహుముఖ ప్రజ్ఞాశాలి" అంటూ గడియారం రామకృష్ణ శర్మ గారి గురించి, "ప్రతిభా భాస్కరుడు" అంటూ పీవీ నరసింహారావు గారి గురించి, నిజాం నిరంకుశ పాలన పైకి కలాన్ని కరవాలంగా ఝుళిపించిన ప్రజాకవి అని చెబుతూ "సాహితీయోధుడు డా. దాశరథి కృష్ణమాచార్య" అంటూ వారి గురించి, అలాగే ఆచార్యత్వం, పాండిత్యం, వక్తృత్వం, సాహిత్యం, పరిశోధన, విమర్శ తదితర రంగాల్లో ప్రజ్ఞా ధురీణయైన "తెలంగాణ సాహితీ దిగ్గజం" అంటూ పాకాల యశోదా రెడ్డి గారి గురించి, యువభారతి అధ్యక్షులుగా, వారి సాహిత్య, సామాజిక సేవలకు అద్దం పడుతూ "సాహితీ సౌజన్యమూర్తి" అంటూ ఇరివెంటి కృష్ణమూర్తి గారి గురించి మరియు విభిన్న ప్రక్రియలలో సాహితీ సృజన చేసి, ఎన్నో మృదు మధుర సినీ గీతాలను అందించడమే కాదు,వైవిధ్య భరితమైన సాహితీ చమక్కులతో కూడిన ప్రసంగాలతో, నిండు తెలుగు వేష ధారణతో, తెలుగు వారి గుండెల్లో చిర స్థాయిగా నిలిచిన "సాహితీ విశ్వంభరుడు సినారె" అని పేరొందిన వారి గురించి, వచన వాగ్మయంపై పరిశోధన చేసి, మరుగున పడిన వచనాలను వెలికి తీసి, పరిశోధక విద్యార్థులకు ఉపయుక్తం అయ్యే పరిశోధనా పద్ధతులను, అంతేగాక ఎన్నో కావ్య రచనలను చేసిన ఆచార్య మడుపు కులశేఖర రావు గారి గురించి, అలాగే రంగినేని సుబ్రహ్మణ్యం, ఎస్.వెంకట రంగారెడ్డి, కపిలవాయి కిషోర్ బాబు వంటి మరుగున పడిన మాణిక్యాలను, వారి రచనలలోని విశేషాలను వ్యాస రూపంలో వెలుగులోకి తీసుకువచ్చిన వేదార్థం మధుసూదన శర్మ గారి కృషి అమోఘం అనవచ్చును.

ఇక రెండవ భాగంలో తెలుగు సాహిత్యంలో సుదీర్ఘమైన చరిత్ర గల నవలా నేపథ్యంలో తొలి నవల తెలంగాణ నుండి వెలువడిందని విపులీకరించిన తెలంగాణ నవలా చరిత్ర గ్రంథ రచయిత పరిశోధనా పారిజాతంలా పరిమళించిన సంగిశెట్టి శ్రీనివాస్ గారి విశేషమైన కృషిని వివరిస్తూ, "సింహాలు తమ చరిత్ర తాము రాసుకోనంత వరకు, గుంట నక్కలు చెప్పే కాకమ్మ కబుర్లే ప్రమాణాలు అయిపోయే ప్రమాదం ఉన్నది" అంటున్న రచయిత గురించి, తెలంగాణ నవలా చరిత్ర తెలిపిన సత్యశోధక ప్రామాణికాంశాలను పాఠ్యాంశాలుగా చేర్చవలసిన ఆవశ్యకతను సునిశితంగా తెలియజేశారు.

శ్రీమతి స్పందన ఆయాచితం గారి ''బంగారు పిచ్చుక కథ" నవలలోని యువత అంతరంగ సంఘర్షణలను, జీవిత సత్యాలను చక్కని వాక్య ప్రయోగాలతో మంత్ర ముగ్ధ భావనతో పఠింపజేసేలా రచయిత్రి చిత్రీకరించారని ప్రస్తుతించారు.

శ్రీ అందోజు పరమాత్మ గారి "తెలంగాణ మాండలిక కవిత్వం" అనే పరిశోధనాగ్రంథాన్ని పరిచయం చేస్తూ, వైవిధ్య భరిత కవితాశిల్పం అంటూ, ప్రశ్నించే దృక్పథంతో ఇది తిరుగుబాటు కేతనం కాగల రేపటి ఉషోదయం అని, సాహితీ విద్యార్థులకు హితవైన గ్రంథం అని హితవు పలికారు.

శ్రీ సుధామ గారి ''మన తెలంగాణ'' గ్రంథములోని 59 అంశాలపై రాసిన వ్యాసాలను గురించి అలవోకగా తెలియజేస్తూ,

"తాళి బంగారానిదా పసుపు కొమ్ముదా అని కాదు,

పసుపు తాడు పలుపు తాడు కాకూడదు

విలువ ఇవ్వాల్సింది జీవితానికి సంస్కృతికి" అన్న ఒక వ్యాసంలోని అద్భుత సత్యాన్ని ఊటంకించారు.ఇలాంటి ఎన్నో విలువైన విషయాలను ఇక్కడ ప్రస్తావించారు శర్మగారు.

ఇంకా 49 మంది తెలంగాణ ప్రముఖ రచయిత(త్రు)ల కవిత్వముతో కూడిన "ఈ నేల వెన్నెల కాయనీ"అనే కవితా సంకలనంలో ఉన్న విశాల వైవిధ్య భరిత కవిత్వం, జీవన లక్షణాలను విలక్షణ రీతిలో వివరిస్తూ మనోవిందులా మన కందించారు రచయిత. అలాగే డా. తిరుమల గారి రుబాయిలు "సందేశ సౌరభాలు-ప్రబోధ పాఠాలు'' గురించిన స్పందనలో,

"పువ్వుకి ఏ పేరు అయితేనేం తావి ప్రధానం కానీ
రత్న నామమేదైతేనేం ప్రభలు ప్రధానం కానీ" అని ,
మరియు
''కలం పట్టుకోగానే కవనం తరగెత్తి రాదు.
ఉలిని పట్టుకోగానే శిల్పం రూపెత్తి రాదు" అంటూ

ఫలం పొందాలంటే ఎంతో స్పందన, మథన, తపన ఉండాలన్న సందేశ సౌరభాలెన్నో స్ఫురింపజేశారు వీరు. ఇంకనూ ప్రముఖ కవి డాక్టర్ పద్దేపల్లి కృష్ణ గారి కవితా సంపుటిలోని కాగితంతో పోల్చిన ఒక కవిత

''కలవారి జీవితం
కరెన్సీ కాగితం
నిరుపేదల జీవితం
నివురు వంటి కాగితం
కర్షకుల జీవితం
కాలుతున్న కాగితం
మధ్యతరగతి
జీవితం మడతలున్న
కాగితం'' అంటూ

పేర్కొన్న విధానాన్ని గురించి, అంతేగాక ఈ సంపుటి వివిధ విభిన్న సామాజిక అంశాల మేళవింపు అన్న మేలైన భావనను వెల్లడించారు భావుకత కలిగిన ఈ వ్యాస రచయిత.

''అనుభూతి మాలికలు'' అంటూ డాక్టర్ కర్నాటి లింగయ్య గారి అర్థశాస్త్ర, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక అంశాలకు అద్దం పట్టిన వారి అసమాన ప్రతిభా పాండితితో కూడిన సాహితీ పరిశ్రమను, వారి ఉత్తమ రచనలను ఇక్కడ ఉన్నతంగా ఊటంకించారు.

అలాగే అనేకమంది వర్ధమాన కవులు, రచయిత(త్రు)లు వివిధ ప్రక్రియలలో చేసిన రచనలను గురించి ప్రత్యేకంగా, ప్రోత్సాహకరంగా ప్రస్తావించారు రచయిత. ''సామాజిక చైతన్య దీపాలు" అంటూ వేముల కోటయ్య గారి రచనల గురించి, "పూల సింగిడి" డా.పోలా సాయి జ్యోతి గారి రచనల గురించి, అలాగే రావూరి వనజ గారి "పూలబాట శతకం'', భీంపల్లి శ్రీకాంత్ గారి "సురవరం మొగ్గలు'', ఆల్వాల లక్ష్మణ మూర్తి గారి "సూర్యోదయం" ఖండ కావ్యం మరియు మేనా పత్ రాందాస్ గారి "దృక్పథ సమూహం" కవితా సంపుటి గురించి, పల్లా నారాయణ శర్మ గారి ''కేతేపల్లి రామచంద్ర శతకం" గురించి, శ్రీరామ్ ఆర్య గారి "ఆర్యా శతకం'' గురించి, శ్రీ గుండోజు యాదగిరి గారి ''ఫేస్బుక్ శతకం'' మున్నగు వాటిపై సమీక్ష వ్యాసాలను ఇందులో పొందికగా పొందుపరిచి, అనుపమానమైన అనుభూతులను అందించే సాహితీ సౌగంధాలను ఉల్లం ప్రఫుల్ల మయ్యేలా పరిమళింప చేశారు.

తమ సహజ సిద్ధమైన సాహితీ ప్రతిభా పాటవాలతో కూడిన విశేషమైన కృషితో రచయిత తాను అక్షర శిల్పియై, తెలంగాణ సాహితీ శిల్పాన్ని మలిచి మరీ "అక్షర శిల్పులు" గ్రంథాన్ని సాహితీ లోకానికి అందించిన వేదార్థం మధుసూదన శర్మ గారితో అభినందనీయులు. విలువైన సాహితీ మూర్తులు కొలువైన ఈ "అక్షర శిల్పులు'' సాహితీ పిపాసులకే కాదు, పరిశోధక విద్యార్థులకు సైతం ఉపకరించే ఉత్తమ గ్రంథం. పాఠశాల విద్యార్థులకు కూడా వ్యాస రచన, ప్రాజెక్టు పని, పుస్తక సమీక్ష వంటివి రాయడంలో చాల ఉపకరిస్తుంది ఈ గ్రంథం.

సౌమనస్కులు సౌశీల్యులు, సాహితీ గంభీరులు అయిన వేదార్థం గారి సాహితీ బలం కలిగిన కలం నుండి మరెన్నో అమూల్య గ్రంథాలు వెలువడాలని అభిలషిద్దాం.

శనివారం రాత్రి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో సామాజిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక సేవా సంస్థ చిమ్మ పూడి ఫౌండేషన్ చతుర్థ వార్షికోత్సవ వేడుకలలో పాల్గొన్న నృత్య కళాకారులను సన్మానిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డా॥ కె.వి.రమణాచారి, ఇ. భవానీదేవి, జి. సత్యవాణి, చిమ్మపూడి శ్రీరామమూర్తి

అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక వికారాబాద్ వారం వారం నిర్వహిస్తున్న వాట్సప్ కవిసమ్మేళనంలో భాగంగా ఈ వారం 'ఎన్నికలు' శీర్షికలో వచ్చిన కవితల్లో మేలైనవి కొన్ని..

నిర్వాహకులు -కమలేశ్
-దోరవేటి, అనంత వ్యవస్థాపకులు



ఎన్నిక లేవైన సరే!

రాజకీయంలో నీతి
ఎన్నటికీ పనికిరాని గీతి
ముందు అన్నీ పంచడం
తర్వాత అవినీతిలో ముంచడం
దాని మహాద్భుతమైన రీతి.
ఒట్టి చేతులతో ఓటు
అడిగితే మాటల పోటు
గొంతును మద్యంలో ముంచినా
గోప్యంగా డబ్బులు పంచినా
మానాయనే! నీకే మా ఓటు.
అమాయకులైతే జనం
అనాయాసంగా నల్లదనం
ఓటు కోసం పంచవచ్చు
రేటు నిర్ణయించవచ్చు
అనే తీరు నాయకులది గుణం.
ఎన్నికల బరిలో దిగుదాం
ఎంతకైనా సరే దిగజారుదాం
అడుగడుగున ఓ అవతారమెత్తి
అడగకున్నా మద్యంలో ముంచెత్తి
ఎలాగైతేనేం మళ్ళీ గెలిచి తీరుదాం.
ప్రజాస్వామ్యానికి చేటు
పైసలకు అమ్ముకుంటే ఓటు
ఐదేండ్లే కదా! అనుకోకు
అంధకారాన్ని కోరుకోకు
ఆలోచనాత్మకమవ్వాలి నీవు వేసే వేటు

-కమలేశ్, 9160396596

ఐదేండ్లే కదా! అనుకోకు

అధికారం నడువలేదు
అహంకార మడ్డుకోదు
ప్రజలు మార్పు గోరినపుడు
గెలుపుగుర్ర మాగబోదు!

అవినీతియు గెలువలేదు
అక్రమ కృషి గెలువలేదు
ప్రజలు మార్పు గోరినపుడు
అధర్మమును గెలువలేదు.

ఏ రోషము పనికిరాదు
ఏ వేషము పనికిరాదు
ప్రజలు మార్పు గోరినపుడు
ఏ దోషము పనికిరాదు!

ఏ కోపము కలుపబోదు
ఏ లోపము నిలుపబోదు
ప్రజలు మార్పు గోరినపుడు
ఏ శాపము తగులబోదు!

ఆటలేవి సాగబోవు
పాటలేవి పారలేవు
ప్రజలు మార్పు గోరినపుడు
మాటలేవి పనికిరావు!

ప్రలోభాలు పనిజేయవు
భయాలేవి పనిజేయవు
ప్రజలు మార్పు గోరినపుడు
కోట్లు కూడ పనిజేయవు!

అభిమానం గెలుస్తుంది
అనురాగం మొలుస్తుంది
ప్రజలు మార్పు గోరినపుడు
ఆప్యాయత పిలుస్తుంది!

ఎన్నికలవి ఏవైనా
నాయకగణ మెవరైనా
ప్రజలు మార్పు గోరినపుడు
ఘనవిజయమే ఏడైనా!

చిత్తశుద్ధి ఊరుతుంది
ఓట్లరద్ది పెరుగుతుంది
ప్రజలు మార్పు గోరినపుడు
కుళ్లుబుద్ధి కూలుతుంది!

మనోశక్తి పేలుతుంది
జ్ఞానశక్తి వెలుగుతుంది
ప్రజలు మార్పు గోరినపుడు
ఓట్లశక్తి ఏలుతుంది!

చిన్నవాళ్లు గెలువవచ్చు
పెద్దవాళ్లు గెలువవచ్చు
ప్రజలు మార్పు గోరినపుడు
ఎవ్వరైన గెలువవచ్చు!

అల్పులంత ఓడవచ్చు
అధికులంత ఓడవచ్చు
ప్రజలు మార్పు గోరినపుడు
ఎవ్వరైన ఓడవచ్చు!

అవునన్నది ఆగవచ్చు
కాదన్నది సాగవచ్చు
ప్రజలు మార్పు గోరినపుడు
విచిత్రాలు జరుగవచ్చు!

నీవు కూడ నిలువవచ్చు
ఓట్లబలము పొందవచ్చు
ప్రజలు మార్పు గోరినపుడు
గొప్పగ ఊరేగ వచ్చు!

పార్టీలేవైన సరే
ఎన్నికలేవైన సరే
ప్రజలు మార్పు గోరినపుడు
గెలిచెదరెవరైన సరే!

-వడిచర్ల సత్యం

ఓటు ఘనత

కోటి యాశయాల కోవెల గంటలు
మారు మ్రోగుచున్న మాటయెకటె
ఓటునమ్ముకున్న చేటును దెచ్చును
చీడ పురుగు చెట్టు చీల్చురీతి.
నీతిమాలి నట్టి నీచుల పాలన
కాటువేయు చుండు కరుణలేక
ప్రజల నెత్తి మీద పాతకు లందరు
పన్నుపోటు తోడ పాతుచుండ.
సేవచేయు వారు నావలు నడిపిన
ప్రగతి రథము సాగు రాజబాట
త్యాగ మయుల కోటు ధర్మపు దేవేరి
నాల్గుపాదములను నడుచు చూడు.
ప్రక్కదారి లోన పాపాత్ములెల్లరు
రాజ్యమేల గలరు రాక్షసముగ
దిక్కుమొక్కులేక దీనజనావళిన్
గద్దలంత గూడి గుద్దులాడ.
తపనచెందువార లుపకార బుద్ధుల
యెన్నుకున్న జరుగు మిన్నమనకు
భిన్నమైనరీతి కన్నుల గాంతుము
దేశ వృక్షమెల్ల తీర్చబడియు

-ఆకుల మల్లికార్జున్,7416067335

ఓటంటే....!



ఓటు.,
జన జీవనానికొక రక్షణ కోటు ,
ఆ హక్కుకై ఆగాలి పద్దెనిమిది సంవత్సరాల పాటు,
ప్రజాస్వామ్యంలో వుంది దీనికి
సరైన చోటు !.
ఓటు.,
పౌరులు ప్రశాంతంగా ఎక్కవలసిన బోటు,
అసెంబ్లీ సభ్యత్వానికి దాటవలసిన అసలైన గేటు,
అధికారంలోకిరావడానికి నిర్ణయిస్తుంది
ఇప్పుడు ఓ రేటు!.
ఓటు..
దీనికోసం పెడతారు
నాయకులు వాగ్దానాల రికార్డ్ ప్లేటు,
అవసరమైతే వదులుతారు పచ్చనోట్ల మసాల ఘాటు,
ఆ తరువాత ఇక తిరిగి చూడరు ఐదేళ్ళ పాటు!.
ఓటు.,
గంట గంటకు పార్టీ మార్చే నాయకులకు
కావాలి ఓ వేటు,
మాటలతో కోటలు -
నీళ్ళతో మూటలు కట్టే వారిని
గద్దె దించడానికి ఇది ఓ రూటు,
కాని, అజాగ్రత్తగా వాడితే తెస్తుంది కదా చేటు!
అందుకే..
ఓటు వేయునప్పు డొకపరి యోచించి,
మంచినాయకుడిని మదిని గాంచి,
ఎంచుకొనగ వలయు నేది యాశించక
అప్పుడే..
అందమైన బ్రతుకు లందివచ్చు !
ఇట్లు,

-దా.. గోగు

ఎన్ని కలలో...

ఎప్పుడో ఏమో
అలా సరదాగా
ఐదేళ్లాకోసారి అమ్ముడుపోతే
నా పది వేళ్ళను
వాడి నోట్లోనే
కుక్కుకుంటాడే...?
కాళ్ళు పట్టుకుని కల్లు
సీసా ప్రేమతో ఇస్తే ...
అప్పుడు తాగినందుకు
ఇప్పుడు బిందెడు
మంచి నీళ్ళను కూడా
అడగొద్దా
నన్ను నావారిని
జీబులో ఎక్కించి
బూతు వరకు తీసుకుపోయి
ఓటు వేయమని నోటిస్తే...
ములాజకు మాట
తప్పకుండా ఓటేస్తే..
నీకు రొడ్డెందుకు ? బస్సెందుకు

అంటాడే???
ఆ ఒక్కటి ఒప్పుకోక తప్పదు.!
ఊర్లో బళ్ళు లేకపోయినా
బెల్టు షాపులు బోలెడు.
ఒళ్ళు వంచి పనిజేయక
తాగి తందనాలాడి చనిపోతే
ఇంటికింత ఎంగిలి మెతుకులు.
దున్నే వాడిదే చేను.
అసలు దున్నితే కదా?
మళ్ళీ ఎన్నికలు.
ఎన్నెన్ని కలలు?
ఐదేళ్ల కోసారి పండుగ.
ఒరే మల్లయ్య, ఎల్లయ్య, రండిరా.
మళ్లీ కొంటారట..
యెంకి పెళ్ళి సుబ్బి చావు.

-శ్రీని, 9396988055

జెర సోంచాయించుండ్రి!.

ఎన్నికలు ఒస్తున్నాయంటే
ఎన్ని 'కలలో 'జనానికి
ఆపదలో ఆదుకునే
ఆపద్భాధవుడొస్తాడనీ!...
ఆకలిని తీర్చి కడుపునింపే
కరుణామయుడు గెలుస్తాడనీ!...
రైతన్నల కష్టాలన్నీ తీరే
ఓ మంచిరోజొస్తుందనీ!...
పేదప్రజల కోర్కెలు తీర్చే
నాయకుడిదే జయమనీ!...
ఎన్నో,ఎన్నెన్నో ఆశలు,ఆశయాలు
మరి!...ఎవరిని గెలిపించాలీ!?...
అనుకున్నవన్నీ నెరవేర్చే
ఆ పాలనాదక్షుడెవరు?
అంతుచిక్కని పరిస్థితి
ఓటుకు నోటిస్తేనే గెలుపేమో!
'మందు' అందించిన వారిదే
పెత్తనమౌతుందేమో!?...
అందరూ 'మంచి' వారే...
అన్నీ పంచినవారికే
పట్టంకడతారేమో!?...
అయోమయ స్థితిలో ఓ ఓటరన్నా!
అన్యాయమైపోతావేమో!?
ఆలోచించుకొని ఓటెయ్యి.
నిర్ణయం నీదేకావచ్చు...
కాని గెలుపపెవరిదో!?....
భారమంతా
ఆ భగవంతుడిపైనే
బాధ్యత మాత్రం
నీదేసుమా!
సోంచాయించనీకే...ఇక
ఛాన్సేలేదుమరి!!...

-అవుసలి ఆంజనేయులు
గ్రామం: వెల్చాల్

ఎన్నికలు

ఎళ్ళకేళ్ళ దౌర్జన్య హింసాయుత
దమనకాండకు చరమ గీతికలు
ఆధునిక భారతావని సిగలో
మానవాభ్యుదయ పతాకలు
రాజరిక ముళ్ళ బాట విడిచి
ప్రజాస్వామ్య పూలదారి పట్టిన
భారత దేశ ఔన్నత్య గీతికలు
ఐదేళ్ల కోసారి మనకు మనమే
రాసుకునే నుదుటి రాతలు
ప్రపంచ రాజకీయ యవనికపై
మనవైన ఘనమైన
అద్భుత కీర్తి కిరీటాలు
గడిచిన పాలనకు తూనికలు
కొత్త కలల సాధనకు పూనిక లు

-అవుసలి వీరబ్రహ్మం

చంద్రకిరణం

నన్ను మంచిగా మార్చిన మహా ఋషి నాన్న
చీకట్లో దారి చూపించే చంద్ర కిరణం నాన్న..
నన్ను సరైన మార్గంలో నడిపించే వెన్నెముక నాన్న
అంధకారం నుండి బయట పారవేసే వెలుగు నాన్న..
కష్టంలో కూడా తోడుండే దేవుడిచ్చిన నేస్తం నాన్న
భాధలో ఉన్నప్పుడు కన్నీటిని తుడిచే ధైర్యం నాన్న..
నాలోని పట్టుదలను పెంచే నా ఆదర్శం నాన్న
నాలోని ఆనందాన్ని అధికం చేసే హరివిల్లు నాన్న..
నాకు ఆత్మబలాన్ని ఇచ్చే దివ్య ఔషధం నాన్న
నైతిక విలువలు నేర్పించే తొలి గురువు నాన్న..
నన్ను ఎప్పుడూ కాపాడుతూ ఉండే సైనికుడు నాన్న
నా భవిష్యత్తు కోసం శ్రమించే సైరికుడు నాన్న..
నన్ను గొప్ప స్థాయికి తీసుకువెళ్ళే సారధి నాన్న
నేను సఫలీకృతుడిని కావడానికి తోడ్పడే వారధి నాన్న
నాన్నతో జీవితం నందనవనం నాన్నకు నా వందనం...

-వలిపే రామ్ చేతన్
బాలకవి, 9వ,తరగతి

నాన్న



ఆనాడు
"ఆడపిల్ల'వన్నాను
నా పాలిటి
అన్నపూర్ణవయ్యావు

-దా. సి. భవానీదేవి
9866847000

కలాన్ని విదిల్చాడు

సాయంత్రం మీదుగా రాతిరిలో
పగలు అదృశ్యం
వికసిత చీకటి విలపిత చీకటి
లోకానికి మరణమా
కవికి రణమా నిద్రాణంగా ఉన్న విశ్వాసాన్ని
జాగృతం చేసి కలాన్ని విదిల్చాడు
అక్షరాలు పక్షుల గుంపులుగా
ఆకాశ దారుల వెంట చుట్టి
చందమామ సాక్షిగా నక్షత్రాల్ని తట్టి
క్రమంగాపిండార బోసినట్టు వెన్నల కురుస్తూ
గంధం చెట్లని ఓరుసుకుంటూ
చల్లగాలి వీస్తూ.

-కోటం చంద్రశేఖర్
9492043348

పుస్తక సమీక్ష

నిశ్శబ్ద విప్లవం

- కూర చిదంబరం
సెల్: 8639338675

నేటి బాలలే రేపటి పౌరులు. రేపటి పౌరులను తీర్చిదిద్దే ప్రయత్నం నేటి నుంచే మొదలు పెట్టాలి. పునాది పటిష్టంగా ఉంటేనే భవనం ధృఢంగా ఉంటుంది. ఈ సదుద్దేశముతోనే రంగినేని మోహనరావు ఎడ్యుకేషనల్ & చారిటబుల్ ట్రస్టు సిరిసిల్లా, తెలంగాణ వారు ఏటా పిల్లల కోసం సృజనశాలలు, "కథా, కవిత్వ రచనా కార్యశాలలు నిర్వహిస్తున్నారు. **'రంగినేని లక్ష్మీపిల్లల పండుగ'** అన్న రెండు రోజుల పిల్లల పండగ ఏటా నిర్వహిస్తున్నారు. కార్యశాలలో పిల్లల సాహిత్యంలో నిష్ణాతులను ఆహ్వానించి పిల్లలతో సృజనాత్మకత పెంచే దిశగా కార్యక్రమా

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 979వ రోజు 'వృద్ధుల అనుభవం- ఆవశ్యకం, అనుసరణీయం' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'వృద్ధుల అనుభవం- ఆవశ్యకం, అనుసరణీయం' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

పెద్దల మాట చద్దిమూట

పెద్దల మాట చద్దిమూట
ఏది చెప్పినా మనకొరకు
మన భవితలో
మనకు ఉపయోగం.
మనిషి గొప్ప వాడు కావాలంటే
పెద్దల మార్గదర్శకాలు మిన్న
ఎవరికీ కనబడక తనను
నడిపించే ఆయుధం.
ఎంతమంది మనతో ఉన్నా
ఎన్ని ఎవరు చెప్పినా
పెద్దల వాక్యానికి మించిలేదు
హృదయ శ్వాస ఉన్నంత కాలం.
మరచిపోలేని పెద్ద తనం
మనని రక్షించి
మన చుట్టూ వారు తిరుగుతూ
మనని ఒక దారిలో పెట్టే గొప్ప తనం.
పెద్ద వారు మనకు ఆశీర్వాదం ఇచ్చి
బిడ్డ సల్లంగుండు అని దీవిస్తూ
మనం ఎదిగితే
వారి మనసు
ఆనందంతో వెలిగిపోతుంది.
అదే వారికి కొండంత సంతోషం.

-వి. సంధ్యారాణి

అనుభవాలనిధి

నాలుగు దశల జీవితం
అనుభవాల పేటిక
బాల్యం పారదర్శకం
యవ్వనం ఉడుకు రక్తం
కౌమారం బరువు బాధ్యతలు
సంగ్రామం వృద్ధాప్యం మళ్ళీ
బాల్యం చేయగలిగినది చేసి
తీర్చవల్సిన బాధ్యతలు తీర్చి
నిర్మల నిష్పాచీ జీవనం
కానీ ఈతరం దైవప్రార్థనతో
మంచిమాట నేర్పుతూ
మనసు నింపుకున్న
మధుర సుసంపన్న
అనుభవాల జ్ఞానం పంచేది వృద్ధులే!
పది మందికి అక్షర జ్ఞానం,బుద్ధి జ్ఞానం
పరమ అద్భుతాల ఆస్తి పంచి
ప్రతిభా పాటవాలు
ప్రభవింపచేసి
నూతన మార్గాలకు
సుగమమైన
దోవ నేర్పరచు రీతి
నేర్పుతారు వారి
అనుభవాల
నైపుణ్యంతో చక్కగా!!!.

-నాగరాజు చుండూరి

-కె.కె.తాయారు

మార్గదర్శకం

వృద్ధాప్యం అంటే
చాలా సందర్భాల్లో...
నెరిసిన జుట్టు
సడలిన పట్టు
చేతికి కర్ర
మతిమరపు బుర్ర
వంగిన ఒళ్ళు
ఊడిన పళ్ళు
అలసిన మనసు
వడలిన సొగసు
పెరిగిన వయసు
ఆగిన తపస్సు
వడలిపోయిన చర్మం
అవమానాల పర్వం
మనసునిండా అనుభవం
కాని ప్రతిరోజు పరాభవం
ఒళ్ళంతా రోగం
కానరాని భోగం
పంచె కట్టు మడులు
జ్ఞాపకాల సుడులు
ఆకలితో అలమటించే కడుపులు
అర్థం చేసుకోని కొడుకులు
దోమల, నల్లుల పడకలు
నోటికి చుట్ట
మాసిన బట్ట
ఆకలి పొట్ట
కోరికల చిట్టా
తీరేదెట్టా
బిడ్డల నిర్లక్ష్యం
ఉడికిన జవసత్వం
మారాలి నేటి యువతరం
వృద్ధుల అనుభవాలు
కావాలి మార్గదర్శకం.

కూరలో కరేపాకు

వృద్ధులు
వయోవృద్ధులు
జ్ఞానవృద్ధులు
సమాజాభివృద్ధికి
ఇద్దరూ అవసరమే
ఎంత అనుభవం వున్నా
ఎంత ఆర్జించినా
వృద్ధాప్యంలో కరేపాకులే
ఆర్జించినంత వరకే విలువ.
జవ సత్వాలుడిగిన వారికి
జవం ఇచ్చేదెవరు?
సత్వం నింపేదేవరు?
మానసిక క్షోభని
అర్థం చేసుకునేదెందరు
ఆదుకునేదెందరు
దాంతో షికారు
కారులో అంతస్తును
పెంచే షికారు
అమ్మ నాన్న మాత్రం
ఓ మూల కారు షెడ్డులో
కరేపాకు బతుకులీడుస్తూ.

-మోటూరి శాంతకుమారి

వృద్ధ దేవోభవ

వృద్ధులు అంటేనే వృద్ధి
కుటుంబ వృద్ధికి మూలం
అన్ని రకాల వృద్ధులు అందించి
పిల్లలని పెంచి వృద్ధి లోకి తెస్తే
కార్లు రైళ్లు మాకు వద్దు
విమానం మా హద్దు
అని రెక్కలు వచ్చిన పక్షుల మాదిరి
మేధావులమంటూ
విదేశీ పరుగు లో
బిజీ వెనుక చూపు
ఇంకా అవసరం లేదే
డబ్బు ఉన్నా ఓపిక లేక
వంట మనుషులు
పనిమనుషులు
దొరకక కొందరు
అన్ని ఉన్నా
వృద్ధ ఆశ్రమం
మెయింటైన్ చేస్తూ కొందరు
ఆర్థిక స్థోమత లేక ఇంకొందరు
ఎండ మావుల వెంట
పరుగు పెడుతూ జీవితం
కొందరు పెద్దలను చూస్తున్నారు
పెద్దల మాట సద్ది మూట ఆనాడు
కానీ పెద్దల మాట
చెదల మూట ఈనాడు
మార్పు తరాల
అంతరాల విలువలు మారాయి
మారే కాలంతో పాటు
పరుగు.

- నారుమంచి వాణీ ప్రభాకరి

జాతిసంపదలు

నిర్జీవ, నిరుపయోగ
వస్తువులు కారు వారు
అవసరం తీరగానే
ఆవల పారవేయడానికి
నీ ఉనికికి కారణమై
నీ పైనే ఆశలు నిలుపుకొని
నీ ఉన్నతికి నిచ్చెనగా నిలిచి
నిన్ను కంటిపాపలా కాపాడుకొని
సదా నీ క్షేమాన్నే కాంక్షించే
తల్లిదండ్రులు వారు!.
నీ జీవితాన్ని తీర్చిదిద్దిన వారు
జీవితానుభవ గీతాసారం వారు
మన జాతి సంపదలు వారు!.
జీవితమంతా నీకై పరిశ్రమించి
నేడు అనారోగ్యంతో
అసహాయతతో
అభద్రతతో
అసౌకర్యంతో
ఒంటరి జీవులైనవారికి
చేతికఱ్ఱగా ఊతంగా నిలబడు
చేయూతనిచ్చి ఆదరించు!.
బదులుగా నీ ఆస్తులు కోరనివారు
నీవు వేధించినా
నీపై కేసు పెట్టని
క్షమాహృదయ
కరుణాంతరంగులు వారు!.
ఆదరణపూర్వకమైన
మాటల చిలకరింపుతో
ఆత్మీయ స్పర్శతో కూడిన
పలకరింపుతో మురిసి పరవశించి
అందదండలు
ఆశీర్వచనాల నీడనందించే
తరువుల వంటి వారు
తల్లిదండ్రులు
నీ జన్మకారకులు!.
శ్రవణుడిలా
కావడిలో మోయనక్కరలేదు
శ్రీరాముడిలా
కానలకేగనక్కరలేదు.
రవ్వంత గౌరవం కలిగి
కాసింత ఆదరణ చూపించు
కూసింత ఆహారం అందించు
ప్రేమగా పలకరించు చాలు
అదే పదివేలు!.

-చంద్రకళ దీకొండ

పాత తేనెకు రుచెక్కువ

ఇప్పుడు పెద్దలు చెప్పే మాటలు
నేటి యువతకు మింగుడుపడని
చేదు మాత్రలు
ఇవే నాలుగు తరాలు దాటితే
ఆ పదాలే అమృతధారలు.
వారసత్వంగా వస్తున్నదిదే
తెలిసీ ఆచరించక పోవడం
మనకలవాటే
కొత్తగా కనుగొని దారి చూపితే
రాళ్ళతో కొట్టి చంపేసిన మనం
ఆ దారిలో నడిచి అభివృద్ధి చెందినా
మన గొప్పేనని అంటాం.
వేల ఏళ్ళ నుండి మనిషితీరే అది
చేయి జారినాకే దాని విలువెంతో తెలిసేది
వయోవృద్ధుల అనుభవసారం
నవతరానికి మింగుడుపడని విషాహారం
ఎప్పుడో ఒకప్పుడు పాత తేనెలా
కాలచక్ర భ్రమణంలో
తిరిగి అమృతం కాకపోదు.

-గుర్రాల వేంకటేశ్వర్లు

అలకించు వృద్ధుల మాట

పెద్దవాళ్లకెక్కడ మర్యాద, గౌరవం
అది కూరలో కరివేపాకు చందం
వారి అనుభవాలకు చెల్లింది కాలం
వారి భావం పాత
చింతకాయ వ్యంజనం
తరాల నడుమ ఏర్పడ్డ అంతరం.
అలనాటి వృద్ధుల అనుభవం
చేర్చింది సంసార నావను
మమతల తీరం
వృద్ధుల మాటొక
అనుభవ సారాల మూట
విన్నవారి మార్గమొక బంగారు బాట.
నిన్నటి బాల్యం నేటి యవ్వనం
నేటి యవ్వనం రేపటి వృద్ధాప్యం
కాచి వడబోసిన వృద్ధుల అనుభవం
బతుకు బయటకు బంగరు కావ్యం.

-జె.వి.కుమార్ చేపూరి

వృద్ధులు మన వెంట ఉండడమొక వరం
నేటి కాలాన కొందరికే దక్కే అదృష్టం
వృద్ధుల మాటే ఒక గొప్ప మార్గదర్శకం
కపటం తెలియని పారదర్శకం
దేశం ఏదైనా,
అది అందరికీ ఆదర్శం
వృద్ధుల మాట వినడం
అందరి ధర్మం
కాదంటే మరి కాలేది
వినన్నోళ్ల ఖర్మం

పవిత్ర దివ్య సందోహం

ముందు వెనకల శుభగమనం
అందరు చేరే శిఖర గమ్యం
పవిత్రమైన దివ్య సందోహం
అందమైన నందనందనం.
బాల్యమంతా బంగారుమయం
తీపి జ్ఞాపకాల అరుణ మందారం
అందరికి అందని శతమానం
చిందర వందరే తొలి ప్రారంభం.
కౌమారాల కార్యశూరత్వం
అత్యుత్సాహాల ఆరిందత్వం
మంచిచెడులు ఎంచనితనం
పొంచి నిలిచు అపాయం.
యవ్వనాల జడివాన మయం
గలగల నడకల గంగమయం
క్షణం చిత్తం క్షణం మాయం
పరుగు పరవళ్ల జలపాతం
హంగుపొంగుల వరదమయం.
ఉరుకులాటల ఉద్వేగమయం
విల్లు సంధించిన సుమశరం
దూసుకొచ్చే మరయంత్రపు తూటాలు
మాటవినని తుఫానుహరికేనులు
కేశసంపదలు రజితమయం
షష్టిపూర్తుల సమారోహం
నిండు పూదోటల అనుభవం
పెదాలు పలకలేని మౌనం
సదాకోరు మన క్షేమాశయం .
చూపులు ఆనని నయనం
అయినా వీడని తాపత్రయం
డైమండ్ జుబిలీ వసంతం
మాట వినలేని శ్రవణం
మురిపించే భావస్ఫోరకం .
ముడుచుకున్నశరీర సౌధం
ముచ్చట గొలుపు పెద్దతనం
సహస్ర చంద్ర దర్శన భాగ్యం
వణుకుతున్నది ప్రతిఅంగం
గోడల మధ్యన బందీమయం.
కదలలేని పాద కరములు
ఆగిపోదు తపనల ఆరాటం
సాగిపోవు మననపు ఒంటరితనం
శుష్కించిన సుందర దేహం
మరుపు నీడన మరోబాల్యం.
పెట్టకూడదు మనం దూరం
పెద్దవారికి పెనుప్రమాదం
వద్దే వద్దు ఛీత్కార సత్కారం
చేరువై నిలువు ఒక్కక్షణం
ఓర్చుగా పలుకు ఓ పదం.
వద్దంటున్నా...వృద్ధాశ్రమం
కాదంటున్నా....సంప్రదాయం
వృద్ధులెపుడు పూజనీయం
కలిగి ఉండడం పెద్ద వరం
సద్దుచేయక మనం సర్దుకుందాం.
ప్రతివారికిదే పరిచయం
ఈ భవిష్యవాణి దొంతర.

- నగునూరి రాజన్న

మన పెద్దవారయ

ఆ.వె.
మరచిపోకు మెపుడు మనపెద్దవారిని
మార్గదర్శులెరి మరువకెపుడు
భవిత కొరకు వారు బాటను వేసియు
దారి చూపిరయ్య దైవముగను!.
ఆ.వె.
ముందు చూపు తోడ పొందుపరిచి రయ్య
ప్రోగు చేసి ధనము సాగు చేసి
అప్పుసప్పు లేక పప్పుకూడు తినుచు
ఎదిగిరయ్య వారు
యెంత బాగు!.

-జక్కని గంగాధర్

మంచుపెట్టె

ఏడ ఉంది చద్దిమూట?
ఒర్లకు !
దోమలెక్క లొల్లి ఏంది ?
ఇంటాబైట
పెద్దలకి నిత్యం సాధింపులు.
మీ జమానా ఐపాయే
మేము సెప్పినట్లు ఇనకుంటే
ఇంతేసంగతులు! అని
ఒంటికాలిపై లేచే ప్లేట్ ఫిరాయింపులు
మూడ్రోజులక్రితం చేసిన వంటకాలు
మురుగువాసనతో ముక్కు బద్దలు.
ఇదీ నేటి
నీటి మూటల మాటలు
కథలు కాకరకాయలు
ఆధునికత పేరుతో
అవ్వకు దగ్గులు నేర్పే యువతరం.
పాలు పెరుగు కల్తీ!
బ్రాందీతో గల్లంతయ్యిందే శాల్తీ
టి.వి తో పొద్దంతా కాలక్షేపం
మూటలాగా పడిఉండే కుక్కిన పేలు
నూతిలోని కప్ప జీవితం
వృద్ధాప్య పింఛను కై
ఎదురుచూసే సంతానం!

-ఎ.రాజ్యశ్రీ

ప్రయివేటు బస్సు బోల్తా - 22 మందికి గాయాలు

అమరావతి, నవంబర్ 1:చిత్తూరు జిల్లాలో ప్రయివేటు బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో 22 మంది ప్రయాణికులు గాయపడ్డారు. గుడిపాల మండలం గొల్లమడుగు మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుదుచ్చేరి నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు.. గుడిపాల మండలంలోని చిత్తూరు- వేలూరు జాతీయ రహదారిపై గొల్లమడుగు మలుపు వద్ద అదుపుతప్పింది. ఈ క్రమంలో గోడను ఢీకొట్టి బోల్తా పడింది.

ఈ ప్రమాదంలో సికింద్రాబాద్కు చెందిన లలిత (65), తమిళనాడులోని మానియంబాడికి చెందిన కుబేంద్రన్(35) తీవ్రంగా.. మరో 20 మంది స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 33 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

లక్షలాది భక్త జన సందోహం మధ్య వైభవంగా సిరిమాను ఉత్సవం

అమరావతి, నవంబర్ 1:ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు శ్రీశ్రీశ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను మహోత్సవం వైభవంగా జరిగింది.. సాయంత్రం 4.18 నిమిషాలకు శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను ను పూజారి బంటుపల్లి వెంకటరావు అధిరోహించారు. 4.37 కి సిరిమాను రథోత్సవం ప్రారంభమైంది .- జాలరివల, పాల ధార, తెల్ల ఏనుగు, అంజలి రథం ముందు నడవగా లక్షలాది మంది భక్తుల జయ జయ ధ్వానాల మధ్య సిరిమాను రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు శ్రీ పైడితల్లి అమ్మవారు. ? తన పుట్టినిల్లు విజయనగరం కోట వద్దకు వెళ్లి, రాజ కుటుంబాన్ని, భక్తులను ఆశీర్వదించిన అమ్మవారు.- కోట పై నుంచి సిరిమాను సంబరాన్ని తిలకించారు ఆలయ ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, కుటుంబ సభ్యులు.- జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఆవరణ లో ఆశీనులై, సిరిమానోత్సవాన్ని తిలకించారు మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు.

.కాగా,రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ పాల్గొన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన విజయనగరం చేరుకుని పైడితల్లమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, అర్చకులు మంత్రి అమర్నాథుకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

పూజా కార్యక్రమాలు అనంతరం ఆలయ ఈవో మంత్రి అమర్నాథ్కు అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం మంత్రి అమర్నాథ్ సిరిమాను ఉత్సవంలో పాల్గొన్నారు. మంత్రి అమర్నాథ్ తో పాటు డిప్యూటీస్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కు చంద్రుగొండ మండల ప్రధాన కార్యదర్శి రాజీనామా

ఖమ్మం, నవంబర్ 1:(నేటినిజం ప్రతినిధి): చంద్రుగొండ మండల బీఆర్ఎస్ పార్టీకి మండల ప్రధాన కార్యదర్శి ఉప్పతల ఏడుకొండలు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తనతో పాటు సుమారు 200 మంది అనుచరులతో తుమ్మల నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరనున్నట్లుగా తెలియజేశారు. పార్టీలో తనకు ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వటం లేదని అనుక్షణం అవమానాలకు గురి చేస్తున్నారన్నారు.

కొత్తగా వచ్చిన వారికి పెత్తనం కట్టబెట్టడం బీసీ బంధులో తన ప్రమేయం లేకుండా లబ్ధిదారుల ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గాదే ప్రసాద్, మాజీ ఎంపీటీసీ లక్ష్మణరావు, కాశి, దండుగల సాంబశివరావు పాల్గొన్నారు.

సాహిత్య విదూషి మణి "డాక్టర్ చిల్లర భవానీ దేవి"

విద్యార్థి దశ నుండే కుటుంబ, ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ ఐదు దశాబ్దాలుగా రచయిత్రిగా, కథకురాలిగా, మానవీయ కోణంలో అక్షర యజ్ఞం చేస్తున్న సాహితీ విదూషిమణి డాక్టర్ చిల్లర భవానీదేవి అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం అన్నమయ్య గ్రంథాలయం లో ప్రముఖ రచయిత్రి, డాక్టర్ చిల్లర భవానీదేవి సాహితీ స్వర్ణోత్సవ ప్రచురణలు "చివరి వలస" కథా సంపుటి, "మరోచరిత" నవల ఆవిష్కరణల సభ ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శివ శంకర్ మాట్లాడుతూ డాక్టర్ భవానీదేవి రచనల్లో వైవిధ్యంతో కూడిన మేధో వికాసం ప్రస్ఫుటమవుతుందన్నారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య పుస్తకాలను ఆవిష్కరణ చేశారు. సభకు సరస్వత కళానిధి డాక్టర్ వెలు ఓలు నాగరాజ్య లక్ష్మి అధ్యక్షత వహించగా కీర్తిశేషులు కోటంరాజు సత్యనారాయణ శర్మ దంపతుల స్మారక సాహితీ పురస్కారం వారణాసి సూర్య కుమారికి అందజేశారు. ప్రముఖ రచయిత్రులు గోటేటి లలితా శేఖర్ చివరివలస, కుందుర్తి పద్మజ మరోచరిత పుస్తకాలను పరిచయం చేశారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎం సుభాని, కోశాధికారి నానా, అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, అమరావతి సాహితీ మిత్రులు అధ్యక్షులు రావి రంగారావు, పలువురు సాహితివేత్తలు, రచయితలు, నగర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ కవి, కీర్తి పురస్కార గ్రహీత శ్రీ ఎస్.ఆర్ పృథ్వి గారి పుస్తక ఆవిష్కరణ

హైదరాబాద్, నవంబర్ 1:(నేటినిజం ప్రతినిధి) అక్టోబర్ 27న గ్రూప్1, గ్రూప్2 పరీక్షలకు హాజరయ్యే వారి కోసం రాజమహేంద్ర వరం, శ్రీ గౌతమి గ్రంథాలయం లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ప్రముఖ కవి, కీర్తి పురస్కార గ్రహీత, అర్ధ శతక గ్రంథ రచయిత ఎస్.ఆర్ పృథ్వి దీర్ఘ కవితా కావ్యం "అమ్మమ్మ గారి ఊరు" ఆవిష్కరించ బడింది. ప్రముఖ సాహితీవేత్త డా.అరిపిరాల నారాయణ రావు గారి అధ్యక్షతన జరిగిన సభలో ముందుగా ముఖ్య అతిథిగా విచ్చేసిన రెటైర్డు ఇన్ కమ్ టాక్సు ప్రధాన కమిషనర్ శ్రీ మేడిశెట్టి తిరుమల కుమార్,ఖీరా గారు అమ్మ మ్మ గారి ఊరు పుస్తకాన్ని ఆవిష్కరిం చి, కవి ఎస్.ఆర్.పృథ్విని సాలువ కప్పి సత్కరించారు. ముఖ్య అతిథి శ్రీ తిరు మల కుమార్ ఎఖీరా గారిని డా.అరిపి రాల నారాయణ రావు గారు సాలు వతో గౌరవ పూర్వ కంగా సత్కరించారు. ఈ కార్యక్ర మంలో గ్రంథాలయ లైబ్రేరియన్ గారు ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ,గ్రూప్ 1గ్రూపు 2 పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నవారు, సమ తా సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఎస్.ఎం. సుభాని సాహితీ సేవలు అభినందనీయం

హైదరాబాద్, నవంబర్ 1:(నేటినిజం ప్రతినిధి) రెండు దశాబ్దాలకు పైగా జిల్లా రచయితల సంఘంలో కార్యదర్శిగా రచయితగా కవిగా ఎస్ఎం సుభాని తన సాహిత్య రచనల ద్వారా కీర్తి గడించడం సాహిత్య లోకానికి గర్వకారణమని ప్రముఖ రచయిత్రి డాక్టర్ చిల్లర భవానీ దేవి ప్రశంసిం చారు.జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కార్యదర్శి, ప్రముఖ సాహితీ వేత్త ఎస్ఎం సుభాని రచించిన కవితా సంపుటి "కాలంతో పాటు"... పుస్తకావిష్కరణ సభ స్థానిక బ్రాడీపేట సిపిఎం కార్యాలయం కొరటాల సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు.కవితా సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరించి మొదటి ప్రతిని నల్మా బేగం కు అందజేసిన అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ భవానీ దేవి మాట్లాడుతూ సుభాని వచన కవితలు సామాజిక చైతన్యాన్ని కలిగిస్తున్నాయని చెప్పారు. సమకాలీన సమాజ సమస్యలపై తన కలాన్ని పదును పెట్టి కవిత జురులను అందించారన్నారు. గ్రంథ పాలకుడుగా వృత్తి లో విశ్రాంత కాలాన్ని సాహిత్య రచనకు పూనుకొని సమాజాన్ని తట్టి లేపే విధంగా రచనలు చేయటం ఆయనలోని తపనకు నిదర్శనమని కొనియాడారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ హంస అవార్డు గ్రహీత డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సుభాని కలం కాలానికి సాక్షిభూతంగా నిలుస్తుందన్నారు. కవితా సంపుటి లోని ప్రతి కవిత గుండెలను పిండుతూ హృదయ ఘోషణను, ఆవేదనను, ఆర్తతను ప్రతిబింబిస్తున్నాయని ఆశీస్సులు అందజేశారు. రమ్య భారతి సంపాదకులు చలపాక ప్రకాష్, సారస్వత కళానిధి డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి గ్రంథ సమీక్ష గావించారుసభకు అధ్యక్షత వహించిన ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా చిరకాలంగా సాహిత్య సేవల ద్వారా తనకు చేదోడు వాదోడుగా ఉన్న సుభాని నిజమైన సాహిత్య మిత్రుడని కొనియాడారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అభ్యుదయ రచయితల సంఘం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్ర మంలో నానా, పలువురు సాహితీవేత్తలు, రచయితలు, సుభాని కుటుంబ సభ్యులు బంధు మిత్రులు తదితరులు పాల్గొన్నారు

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

'బుధవారం బాద్షా'

పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

(ప్రథమ)

ఓటములే నిచ్చెనమెట్లుగా

మూసిన కనురెప్పల వెనుక
ముసిరే ఆలోచనలెన్నో!
మూసిన తలుపుల వెనక
తలుపుతట్టే అవకాశాలెన్నో!.
అవకాశాల తలుపులు
మూసుకొన్నప్పుడు
తెరచుకొనే ప్రయత్నాలు
వేయి చేసేది కొందరు
అవకాశం తలుపు తడుతున్నా
ఉన్నులు,చెవులకు
గంతలతో మరికొందరు!.
ఆశలన్నీ తలక్రిందులైనాయని
నిరాశతో వగచేది కొందరు
అవకాశం ఒకచోట ఉంటే
తలక్రిందులుగా ఆలోచించి
వేరొకచోట వెతికేది ఇంకొందరు!
పగటికలలతో త్రిశంకుస్వర్గంలో
విహరించేవారు కొందరు
అవినీతి అడ్డదారులు
తొక్కేవారు మరెందరో!
ఓటములను నిచ్చెనమెట్లుగా మలచుకొని
కృషి,పట్టుదలలతో
ఆశావాదంతో ఎగబాకేవారే
గెలుపు శిఖరం చేరగలరు
విజయకేతనం ఎగరేయనూగలరు!.

-చంద్రకళ.దీకొండ

(నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ)

(ద్వితీయ)

ఆటంకాలెన్నో

అవకాశాల దారిలో ఎత్తు పల్లాలెన్నో
అడుగడుగునా ఆటంక పరిచే కంటకాలెన్నో !
అధిగమించే ప్రయత్నంలో కాలం విసిరే సవాళ్ళన్నో
అడ్డంకులు సృష్టించే అసూయాపరుల క్రియలెన్నో!!.
అయినా! లెక్క చేయకుండా ఆచితూచి వేస్తున్న ఒక్కో అడుగు,
అధైర్యానికి ముచ్చెమటలు పట్టించి
ఆమడ దూరం తరిమి తరిమి కొడుతుంటే ఆశ్చర్యంగా
అవని ఆనందంగా అక్కున చేర్చుకుని మురిసి పోదూ!!.
ఆశలను అందుకోవాలని ఆరాటంతో తీస్తున్న ఉచ్ఛ్వాస
అలసటను అలముకొని ఆనందభైరవి రాగంలో ఆరోహణ
అవరోహణ చేయించి శ్రావ్యంగా వినిపించి, మైమరిపించి,
అజేయంగా నిన్ను నీవు ఆవిష్కరించుకుంటుంటే
అమ్మానాన్నల సంతోషాలకు అవధులు ఉంటాయా!?.
సంకల్పంతో ముందుకు మును ముందుకు నడుస్తుంటే
సమయం అదే అవకాశం, ఒడిలో ముద్దులొలికే
సుమబాలై నయరాగాలు పోతూ విజయుణ్ణి చేసి
సార్వజనీనమైన ప్రేమను పొంది వెలుగొందుతుంటే!!.
అచ్చెరువొంది ఆప్యాయంగా అశేష ప్రజానీకం
అందించదా ! హారతులు! అభిమాన నీరాజనాలు!
అనంతంగా సాగిపోయే అవకాశాల దారిలో
అణువణువూ! అనురాగ బంధంతో కట్టి వేయదా!!.
ఆకలి దప్పిక మరచి అవకాశాల దారి పట్టి
అనువుగ ఇచ్ఛాశక్తిని ఒడిసి పట్టి నిద్రను కట్టేసి,
అనిలో దిగి ఆరంగేట్రం చేస్తుంటే,
కొన్ని ఎదురు దెబ్బలతో అసిగాయాలైనా,
అంతిమ లక్ష్యం, ఆ క్షణాలను అందిపుచ్చుకుంటే
జయ కేతనం ఎగిరి నీలాకాశాన్ని ముద్దెట్టుకోదూ! తప్పకుండా!!

-కేశరాజు వేంకట ప్రభాకర్ రావు

టీవీ యాంకర్స్‌కు పురస్కారాలు ప్రదానం

పురస్కార గ్రహితలతో ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి

హైదరాబాద్, నవంబర్ 1:(నేటి నిజం ప్రతినిధి)జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో కూచిపూడి నృత్య ప్రదర్శన, టీవీ యాంకర్స్‌కు పురస్కార ప్రదానోత్సవం జరిగింది.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి ముఖ్య అతిథిగా పాల్గొని జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ యాంకర్స్ పురస్కారాలను యాంకర్స్‌కు అందజేశారు. లయన్ చిల్లా రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామరాజు శ్రీనివాసరావు, సి. రామకృష్ణ, ఆదినారాయణ, లక్కరాజు నిర్మల, కుసుమ భోగరాజు, కొండపాక కృష్ణమాచార్య, మహమ్మద్ రఫి, జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఛైర్మన్ గుదిబండి వెంకటరెడ్డి తదితరుల